MAHILA SADHIKARATHA

# మహిళా సాధికారత

స్వయంసహాయ ఉద్యమ సమాచార తెలుగు మాస పత్రిక

mas

సంపుటి : 24 సంచిక: 6 రంగారెడ్డి ఫిబ్రవరి 2026 పేజీలు : 36 వెల : రూ. 10/-

## ముఖ్యమంత్రి 'బంగారు' సమీక్ష!




పి4 మార్గదర్శులు - బంగారు కుటుంబాల ముఖాముఖీలో ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయుడు గారికి మేఘా, ఏపిమాస్ సంస్థల బంగారు కుటుంబాల గురించి వివరిస్తున్న శ్రీ సి ఎస్ రెడ్డి

## రామారెడ్డి గారికి పద్మశ్రీ !





ముఖ్యమంత్రి చేతుల మీదుగా పి4 మార్గదర్శులకు జ్ఞాపికలు !



ఏపిమాస్ ఎఫ్ పి ఓల రైతులకు విజయరామ్ సహజ వ్యవసాయ శిక్షణ

Silver Jubilee Year

apmas

Empowering Communities

NABARD

నాబార్డ్ సౌజన్యంతో ....

మీకు తెలుసా


?

**గత 46 ఏళ్ళల్లో (1970-2016 ) ..**

- ఉష్ణోగ్రత 0.48 డిగ్రీలు పెరిగింది
  - దీనివల్ల పంట దిగుబడులు 3%-10% వరకు తగ్గాయి.
- వానాకాలంలో పడే వాన 26 మి.మీ.లు తగ్గింది
  - 0.1 మి.మీ. వాన తగ్గితే, దిగుబడులు 0.2% -0.3% వరకు తగ్గుతాయి
  - మొత్తంగా పంట దిగుబడులు 13%-18% వరకు తగ్గాయి.
- వ్యవసాయ ఆదాయం సగటున 15%-25% తగ్గింది

## వాతావరణం మారుతోంది...

ఏటేటా పెరుగుతున్న ఎండలు



వద్దనుకుంటే వానలు...



జీవం కోల్పోతున్న భూములు....



పెరుగుతున్న పంటకు పురుగులు, తెగుళ్ళు ...



## బతుకు భద్రత తగ్గుతోంది...



వాన కోసం ఎదురుచూపులు...



అనుకోని వరదలు ...



మొలకకు అందని నీళ్ళు



చేతికి అందని పంటలు

రానున్న 30 ఏళ్ళల్లో (2020-2050) ...

ఉష్ణోగ్రత 1%- 1.4% పెరుగుతుందని అంచనా ... ఒక్కసారి పరిస్థితి ఊహించండి!!

## మనకున్నది ఇప్పుడు ఒకే మార్గం...

## వాతావరణ మార్పులను తట్టుకునేలా సంసిద్ధం కావడం

NABARD

# మహిళా సాధికారత

సంపుటి 24 సంచిక 6





సంపాదకీయం

## దిశానిర్దేశం !

క్రిందటి నెల (జనవరి) చివరి రోజు ఒక 'బంగారు' రోజు ! ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని పేదరిక రహిత రాష్ట్రంగా చేయాలన్న సత్సంకల్పంతో ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబునాయుడు గారు చేపట్టిన పి4 (ప్రభుత్వ, ప్రైవేటు రంగ భాగస్వామ్య కార్యక్రమం) ప్రాజెక్ట్ అమలు తొలి అడుగులలో భాగంగా ఆరోజున మార్గదర్శులు, బంగారు కుటుంబాల ముఖాముఖీ జరిగింది. పేద కుటుంబాలను దత్తతతీసుకుని, వారికి సుస్థిరాభివృద్ధి మార్గం చూపే సంస్థలను, వ్యక్తులను 'మార్గదర్శులు' అని, ఆవిధంగా లబ్ధి పొంది అభివృద్ధి పథంలో ముందడుగు వేసే కుటుంబాలను 'బంగారు కుటుంబాలు' అని వ్యవహరిస్తున్నారు. తాము పేదలము, అసహాయులము అన్న భావనే రాకుండా 'బంగారు కుటుంబాలు' అని సంబోధించడం అభినందనీయం! చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలో జరిగిన ఈ ముఖాముఖీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబునాయుడు గారు స్వయంగా పాల్గొని, పి4 కార్యక్రమం అమలు తీరును సమీక్షించడం, దిశానిర్దేశం చేయడం విశేషం. పనుల ఒత్తిడి ఎంతగా వున్నప్పటికి ముఖ్యమంత్రి గారు గంటకుపైగా ఈ కార్యక్రమంలో పాల్గొనడం, మార్గదర్శుల, బంగారు కుటుంబాల ప్రతినిధులు చెప్పిన విషయాలను, తెలిపిన వివరాలను ప్రశాంతంగా వినడం, ప్రశ్నించి మరిన్ని వివరాలు తెలుసుకోవడం, తగిన సూచనలు, సలహాలు యివ్వడం, అవసరమైన మేరకు ప్రభుత్వం తప్పనిసరిగా తోడ్పాటు అందిస్తుందని హామీ యివ్వడం పి4 కార్యక్రమానికి ఆయన ఎంత ప్రాధాన్యం, ప్రాముఖ్యం యిస్తున్నారో తెలియజేస్తుంది. పేదరికాన్ని తొలగించడం అంటే కేవలం ఆర్థిక స్తోమతను మెరుగుపరచడమే కాదని, విద్యాపరంగా, నైపుణ్యాల పరంగా, ఆరోగ్యపరంగా, అవకాశాల లభ్యత పరంగా, దృక్పథంలో రావలసిన మార్పు పరంగా, అన్ని కోణాలలో సమగ్రమైనరీతిలో అభివృద్ధి సాధించినప్పుడే పేదరికం తొలగినట్టు అని ముఖ్యమంత్రి గారు చేసిన వివరణ ఈ కార్యక్రమం ఎంత ఉదాత్తమైనదో, ఎంతగా సమూలమైన, విస్తృతమైన మార్పులు, సంస్కరణలు అవసరమో అవగాహన కలిగిస్తుంది. కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు మండలంలో, చిత్తూరు జిల్లా రామకుప్పం మండలంలో మేఘా ఇంజినీరింగ్ సంస్థ (ఎం ఇ ఐ ఎల్) పి4 ప్రాజెక్ట్ మార్గదర్శక పాత్ర వహిస్తున్నది. ఆ సంస్థ నిర్వాహక భాగస్వామిగా నిర్దిష్ట ప్రమాణాలకు, లక్ష్యాలకు అనుగుణంగా ఈ కార్యక్రమం ఆమలు బాధ్యతను ఏపిమాస్ వహిస్తున్నది. అ ప్రాతినిధ్యంతో ముఖ్యమంత్రి గారి ఈ సమీక్షా సమావేశంలో పాల్గొనే అవకాశం నాకు లభించింది. పి4 ప్రాజెక్ట్‌లో మేము పని చేస్తున్న రెండు మండలాలలో కార్యక్రమం అమలు పురోగతిని వివరించినప్పుడు ముఖ్యమంత్రిగారు ఆసక్తిగా మరిన్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. మార్గదర్శులకు, బంగారు కుటుంబాలకు అనుసంధాన కర్తలుగా పనిచేసే కార్యకర్తలను 'బంగారు మిత్ర'లు అని సంబోధించడం బాగున్నదంటూ, ఇకపై వారిని రాష్ట్రమంతటా యిదే పేరుతో వ్యవహరించాలని సూచించారు. 50–100 బంగారు కుటుంబాలకు ఒక బంగారు మిత్ర వుండాలని, ప్రతి 500–700 కుటుంబాలకు ఒక క్లస్టర్ ఏర్పాటుచేయాలని ఆయన సూచించారు. అర్హత కలిగిన బంగారు కుటుంబాలను ఎలా ఎంపిక చేయాలో కూడా ముఖ్యమంత్రిగారు వివరించారు. విశేషం ఏమిటంటే, ముఖ్యమంత్రిగారు చేసిన సూచనలలో చాలావరకు యిప్పటికే మేఘా–ఏపిమాస్ భాగస్వామ్యంలో పాటిస్తున్నాము. ఇది మాకు హర్షదాయకమైన విషయం. ఇకపై ప్రతి మూడు నెలలకు పి4 ప్రాజెక్ట్ అమలు తీరును సమీక్షిస్తానని కూడా ముఖ్యమంత్రి గారు పేర్కొన్నారు. మరింత పకడ్బందీగా, మరింత ప్రభావోత్పాదకంగా, మరింత ఫలప్రదంగా కార్యక్రమ నిర్వహణకు ఈ సమీక్షలెంతైనా దోహదం చేస్తాయి. ఇంత సమగ్రంగా దిశానిర్దేశం చేసినందుకు ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబునాయుడు గారికి మన:పూర్వక ధన్యవాదాలు.

జనవరి నెలలోనే జరిగిన మరో అభినందనీయ విశేషం కీర్తిశేషులు మామిడి రామారెడ్డి గారికి కేంద్రప్రభుత్వం పద్మశ్రీ పురస్కారాన్ని ప్రకటించడం. ఇది ఎంతైనా ఆనందకరమైన విషయం. నిస్వార్థమైన, నిష్కళంకమైన, అంకితభావంతో కూడిన స్వచ్ఛంద సేవకు శ్రీ రామారెడ్డి గారు నిలువెత్తు నిదర్శనం. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులకు అభినందనలు. కొంత ఆలస్యంగానైనా అద్వితీయమైన అర్హతను గుర్తించిన కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు.




**Edited, Printed, Published and owned by T.Chandra Sekhar Reddy; Printed at Kala Jyothi Process Pvt Ltd, Plot No.CFC-1&2, Survey No.18, E-city, SEZ, General Industrial Park, Raviryal and Srinagar, Maheswaram, Ranga Reddy District, Telangana - 501359 and Published at Mahila Abhivruddhi Society, Andhra Pradesh (APMAS), Plot No.11&12,HUDAColony, Tanesha Nagar, Near DreamVally, Manikonda,Ranga Reddy District,Telangana-500089. Editor:T.Chandra Sekhar Reddy**


ఆయినవారి మౌనం గుండెల్లో గునపం , అందుకే మాటామంతీ కొనసాగిస్తుండాలి

# మహిళా సాధికారత


ఎడిటర్ : **టి.చంద్రశేఖర రెడ్డి**  అసోసియేట్ ఎడిటర్ : **జె.వి. క్రిష్ణమూర్తి**

**ఎడిటోరియల్ కమిటి: జి. శ్రీనివాస్, ఎల్. భవాని, ఆర్ రమాదేవి, ఎం. భార్గవి, కె శ్రీనివాస్, ఆర్ బ్రహ్మచారి**

**కంపోజింగ్, డిజైనింగ్ : ఎన్. రమాదేవి , కన్సల్టెంట్ : కె. రఘురామరాజు**

**సమన్వయ సహకారం : పి. ఝాన్సీ లక్ష్మి, సాంకేతిక సహకారం: క్రిస్టొఫర్ వసంత్**


## లోపలి పేజీలలో ....


- పి4ప్రాజెక్ట్ అమలుపై ముఖ్యమంత్రి దిశానిర్దేశం 05
- చిన్న, సన్నకారు రైతులకు భారీ ప్రోత్సాహకాలు 07
- సహకార ఉద్యమ సారథికి పద్మశ్రీ పురస్కారం! 08
- 'పట్టణ' పోషకాహార సవాళ్ళపై కార్యాచరణ! 10
- 'పి4' బంగారు మిత్రలకు మూడు రోజుల శిక్షణ 12
- నిస్సహాయమహిళలకు 'బంగారు' జీవనోపాధులు 15
- 30వేల లీటర్ల 'అమృతజలం' ఆరోగ్యం! 16
- 'పద్మ' సరోవరంలో మహిళా వికాసం! 18
- పద్మ పురస్కారాలలో తెలుగు తేజాలు! 21
- గ్రామ స్థాయిలో చిరుధాన్యాల ప్రాసెసింగ్! 24
- వరి కంకి – ఎకరానికి 10 టన్నుల దిగుబడి 25
- అనంతలో జల సంరక్షణకు ప్రధాని ప్రశంస! 26
- 'ఒక ఎకరం–ఒక సీజన్' మోడీ వ్యవసాయమంత్రం 27
- 'నెలసరి' ఆరోగ్యం మహిళల ప్రాథమిక హక్కు 28
- 'మునగ' ప్యాడ్లతో బహిష్టు సురక్ష 29
- పచ్చి పసుపుతో ఆరోగ్యకర ఆహారపదార్ధాలు ! 30
- తెలంగాణ మాతృత్వ ప్రయోజన పథకం 32
- తేనెటీగల పెంపకంతో రూ. 40 లక్షల సంపాదన 34


### 'మహిళాభివృద్ధి సొసైటీ' (ఏపిమాస్)

**'మ**హిళా సాధికారత' పత్రిక మాతృసంస్థ మహిళాభివృద్ధి సొసైటీ. దీనిని ఏపిమాస్ అని, మాస్ అని కూడా సంక్షిప్తంగా పిలుస్తారు. 2001జూన్ 14 వ తేదీన పబ్లిక్ సొసైటీగా మహిళాభివృద్ధి సొసైటీ హైదరాబాద్ ప్రధాన కార్యాలయంగా ఏర్పాటైంది. తెలుగు రాష్ట్రాలలో, మన దేశంలోని ఇతర అనేక రాష్ట్రాలలో మహిళా స్వయంసహాయ సంస్థల సుస్థిరాభివృద్ధికి విశేష సేవలను అందించిన ఈ సంస్థ ప్రస్తుతం రైతుల అభ్యున్నతికి, పర్యావరణ పరిరక్షణకు, ఆదర్శ గ్రామాల నిర్మాణానికి, స్వయంసహాయ సంస్థల స్వయం నియంత్రణకు గణనీయమైన కృషి చేస్తున్నది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ప్రధాన కార్యదర్శిగా పని చేసి పదవీ విరమణ చేసిన శ్రీ కె. మాధవరావు ఛైర్మన్‌గా వివిధ రంగాలలో విశేషానుభవం గడించిన ప్రముఖులు ఈ సంస్థ పాలకవర్గంలో వున్నారు. సంస్థ వ్యవస్థాపక సి ఇ ఓ శ్రీ సి ఎస్ రెడ్డి ఎండి గా, సిఇఓ గా వున్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, బీహార్‌లలో కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఈ సంస్థకు ప్రధాన కార్యాలయంతో పాటు, ఒక ప్రాంతీయ కార్యాలయం, 21 క్షేత్ర కార్యాలయాలు వున్నాయి. దాదాపు 250 మందికి పైగా సిబ్బంది వున్నారు. ప్రజలకు అవగాహన కలిగించడం కోసం 'మహిళా సాధికారత' పత్రికతో పాటు వివిధ వైజ్ఞానిక పుస్తకాలను, ఈ సంస్థ ప్రచురిస్తుంటుంది.


| ప్రోత్సాహక చందా | | |
|---|---|---|
| ఏడాదికి | : | రూ. 110 |
| రెండేళ్ళకు | : | రూ. 200 |
| మూడేళ్ళకు | : | రూ. 280 |

| ప్రకటన ఛార్జీలు | |
|---|---|
| మల్టీకలర్ ఫస్ట్ పేజి (సగం)/బ్యాక్ పేజి(పూర్తి) | : రూ. 25,000 |
| మల్టీకలర్ ఇన్‌సైడ్ కవర్ పేజి (పూర్తి) | : రూ. 15,000 |
| బ్లాక్ అండ్ వైట్ లోపలి పేజి (పూర్తి) | : రూ. 10,000 |

**చందాలు లేదా ప్రకటనలకోసం పంపే డిడిలను 'ఏపిమాస్ -హైదరాబాద్' పేరుమీద పంపాలి**

మహిళా సాధికారత, ఏపిమాస్ కార్యాలయం, ప్లాట్ నెం.11-12, హుడా కాలని, తానీషా నగర్, డ్రీమ్‌వ్యాలీ దగ్గర, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు-500089. ఫోన్ : 08413-403118
Web: www.apmas.org, E Mail: info@apmas.org


ఆశాభావం అన్నిటినీ అనుకూలంగా మార్చే మంత్రదండం కాదు, దేనికైనా నిన్ను సిద్ధంచేసే మనోబలం !

# పి4 ప్రాజెక్ట్ అమలుపై ముఖ్యమంత్రి దిశానిర్దేశం!

## కుప్పం నియోజక వర్గంలో మార్గదర్శులు, బంగారు కుటుంబాల ముఖాముఖి నిర్వహణ

**ఆం**ధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పి4 ప్రాజెక్ట్ అమలుతీరు సమీక్ష 31-01-2026న చిత్తూరు జిల్లా కుప్పం నియోకవర్గం లోని తులశినాయన పల్లెలో ముఖ్యమంత్రి పాల్గొన్న 'ప్రజా వేదిక' లో జరిగింది. ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయుడు స్వయంగా సమీక్ష నిర్వహించారు. ముఖ్యమంత్రి మార్గదర్శి సంస్థలు ఎం ఇ ఐ ఎల్, అదానీ ఫౌండేషన్, టీ వి ఎస్ ప్రతినిధులతో పాటు బంగారుమిత్రలు, బంగారు కుటుంబాలతో ముఖాముఖిగా మాట్లాడారు.

ముఖ్యమంత్రి ఎంతో ఆసక్తితో విషయాలను వింటూ, భవిష్యత్తులో ఈ ప్రభావాన్ని మరింత బలోపేతం చేయడానికి,



పనుల్లో మరింత 'శక్తిపూర్వక సమన్వయం' (సినర్జీ విత్ ఎనర్జీ) సాధించడానికి మార్గదర్శకులకు ఎంతో ఉపయోగకరమైన సలహాలు, సూచనలు యిచ్చారు. దిశానిర్దేశం చేశారు.

చిత్తూరు జిల్లా రామకుప్పం మండలంలో, కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు మండలంలో మేఘా ఇంజినీరింగ్ సంస్థ (ఎం ఇ ఐ ఎల్) పి4 ప్రాజెక్ట్ భాగస్వామి (మార్గదర్శి) గా వున్నది. ఆ సంస్థ తరఫున ఆ రెండు మండలాలలో కార్యక్రమాన్ని అమలుచేసే బాధ్యతను ఏపిమాస్ వహిస్తున్నది.

ముఖ్యమంత్రి నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఏపిమాస్ సి ఇ ఓ, ఎం డి శ్రీ సిఎస్ రెడ్డి పాల్గొని, రెండు మండలాలలో కార్యక్రమం అమలు తీరును ఆయనకు వివరించారు.

**ముఖ్యమంత్రి సమీక్ష ముఖ్యాంశాలు:**

- **సుదీర్ఘ సమీక్ష:** ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు పి4 ప్రాజెక్ట్‌పై ఎంతో ఆసక్తిని కనబరిచారు. కుప్పం నియోజకవర్గంలో జరుగుతున్న కార్యక్రమాలపై ఆయన ఒక గంటకు పైగా సమీక్ష నిర్వహించారు. కుప్పం ఏరియా డెవలప్మెంట్ అథారిటీ (కె ఎ డి ఎ) పీడీ, ఏపిమాస్ సిఈఓ శ్రీ సి.ఎస్. రెడ్డి ప్రాజెక్టుల పురోగతిని వివరించారు.
- **బంగారుమిత్ర :** 'బంగారుమిత్ర' అనే పేరును రాష్ట్రవ్యాప్తంగా ఏకరీతిగా ఉపయోగించాలని సూచిస్తూ, ఈ విధానాన్ని ఆయన అభినందించారు. ప్రతి 100 కుటుంబాలకు ఒక కార్యాచరణ ప్రణాళిక (యాక్షన్ ప్లాన్) ఉండాలని, దాని ద్వారా బంగారుమిత్రలు నిరంతర సహాయం అందించాలని నొక్కి చెప్పారు.
- **వ్యవస్థాగత మద్దతు:** ప్రతి 500 కుటుంబాలకు ఒక క్లస్టర్ ఏర్పాటు చేసుకుని, ఒక కో-ఆర్డినేటర్‌ను నియమించడం ద్వారా పర్యవేక్షణను మరింత క్రమబద్ధం చేయాలని ఆయన సూచించారు. సమాజంలో సేవాభావం ఉన్న వలంటీర్లను గుర్తించి, వారిని బంగారు కుటుంబాలతో అనుసంధానం చేయాలని చెప్పారు.
- 'ఒక కుటుంబం - ఒక పరిశ్రమ' (వన్ ఫ్యామిలీ - వన్ ఎంటర్‌ప్రైజ్) విధానాన్ని ప్రభుత్వ పథకాలతో




సమన్వయం చేయడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చని ఆయన పేర్కొన్నారు.

- **విద్యకు ప్రాధాన్యత :** విద్యాభివృద్ధి ద్వారానే తరాల మార్పు సాధ్యమని ఆయన అన్నారు. ప్రతి కుటుంబంలోని పిల్లల విద్యా అవసరాలను గుర్తించి.. పాఠశాల ప్రవేశాలు, రెసిడెన్షియల్ హాస్టళ్లు, ప్రత్యేక కోచింగ్, కెరీర్ గైడెన్స్ ద్వారా వారికి అండగా ఉండాలని స్పష్టం చేశారు.
- **పశు సంవర్ధక శాఖ :** సామూహిక పశుగ్రాసం అభివృద్ధితో పాటు, 30-40 కుటుంబాలకు ఉపయోగపడేలా 'పశు హాస్టల్స్' (క్యాటిల్ హాస్టల్స్) స్థాపనకు కృషి చేయాలని సూచించారు.



**డిజిటల్ హెల్త్ రికార్డులు :**

ఇ-సంజీవని ద్వారా ప్రతి కుటుంబ సభ్యుడి ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షించాలని, ప్రతి ఒక్కరి 'డిజిటల్ హెల్త్ కార్డ్'ను బంగారు మిత్రలు నిర్వహించాలని ఆదేశించారు.

**ఆస్తి కల్పన, సమీక్ష :**

కుటుంబాల ఆస్తి నిర్మాణ నైపుణ్యాలను (ఎసెట్ క్రియేషన్ స్కిల్స్) పెంచడంలో మార్గదర్శులు కీలక పాత్ర పోషించాలని చెప్పారు. ఈ కార్యక్రమంపై ప్రతి మూడు నెలలకు ఒకసారి సమీక్ష, ఏడాదికి ఒకసారి అధికారిక అంచనా (ఫార్మల్ ఎసెస్‌మెంట్) ఉంటుందని ముఖ్యమంత్రి వెల్లడించారు.

**ఒక కుటుంబం- ఒక పారిశ్రామికవేత్త**

ఒక కుటుంబం - ఒక పారిశ్రామికవేత్త (వన్ ఫ్యామిలీ - వన్ ఎంటర్‌ప్రెన్యూర్) కార్యక్రమంలో భాగంగా ఫ్రాంటియర్ మార్కెట్, మన రోవర్ సంస్థల నుంచి లబ్ధి పొందిన మహిళలతో ముఖ్యమంత్రి ముఖాముఖి నిర్వహించారు. డ్వాక్రా సభ్యులను తాము ఏ విధంగా ఆర్థికంగా బలోపేతం చేస్తున్నదీ సంబంధిత కంపెనీల ప్రతినిధులు ముఖ్యమంత్రికి వివరించారు.

**రాష్ట్ర వ్యాప్తంగా సంజీవని ప్రాజెక్ట్**

కుప్పంలో సంజీవని ప్రాజెక్టును అమలు చేస్తున్నట్టు ముఖ్యమంత్రి తెలిపారు. ప్రజలకు 42 వైద్య పరీక్షలు చేసి వారి ఆరోగ్య సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నామని, నియోజక వర్గంలో రక్తహీనత, మధుమేహం, రక్తపోటు బాధితులు అధికంగా ఉన్నారని, ఎవరెవరికి ఏయే సమస్యలున్నాయో తెలుసుకుని ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్టు ఆయన చెప్పారు.

'ఈ ఏడాది నుంచే రాష్ట్రవ్యాప్తంగా సంజీవని ప్రాజెక్టుకు శ్రీకారం చుడతాం. సంజీవని ప్రాజెక్టు దేశానికే ఆదర్శమవుతుంది' అని ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయుడు ఆశాభావం వ్యక్తం చేశారు. ■

మెచ్చుకునే వారి కంటె విమర్శించే వారి వల్లనే ఎక్కువ మేలు జరుగుతుంది, సామర్థ్యం పెంచుకోవడానికి వారే మూలం

# చిన్న, సన్నకారు రైతులకు భారీ ప్రోత్సాహకాలు

**కేం**ద్ర బడ్జెట్‌లో చిన్న, సన్నకారు రైతుల ఆదాయాన్ని పెంచేందుకు ప్రాధాన్యమిచ్చామని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. అధిక దిగుబడి ఇచ్చే పంటలతో పాటు అధిక విలువైన పంటల దిశగా రైతులను ప్రోత్సహిస్తామని తెలిపారు. కొబ్బరి ఉత్పత్తి పెంపునకు ప్రత్యేక ప్రోత్సాహక పథకం... కాయలు కాయని చెట్ల స్థానంలో కొత్త చెట్ల నాటకానికి ప్రోత్సాహకాలు అందిస్తామని స్పష్టం చేశారు.

జీడిపప్పు, కోకో ఉత్పత్తి కోసం ప్రత్యేక చర్యలు, గంధం చెట్ల వనాలు, బాదం, పైన్‌నట్స్ కోసం ప్రత్యేక పథకం తీసుకొస్తామని తెలిపారు. దేశవ్యాప్తంగా ఉన్న 500 రిజర్వాయర్లలో చేపల పెంపకానికి తోడ్పాటు అందిస్తామని అన్నారు. పశు సంవర్ధక శాఖలో భారీ ప్రోత్సాహకాలు, అధిక విలువ పంటలకు ప్రోత్సాహం, తీర ప్రాంతాల్లో కొబ్బరి, గంధం చెట్ల నాటకానికి ప్రోత్సాహం ఇస్తామని కేంద్ర మంత్రి ప్రకటించారు.

నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన 2026-27 బడ్జెట్, వ్యవసాయ రంగ వృద్ధికి కొత్త దిశా నిర్దేశం చేసింది. పంటల పైనే కాకుండా, వ్యవసాయ అనుబంధ రంగాలైన మత్స్య, పశుపోషణ ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచడమే లక్ష్యంగా ఈ బడ్జెట్‌లో కీలక ప్రతిపాదనలు చేశారు.

'వికసిత భారత్ 2047' లక్ష్య సాధనలో భాగంగా, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు ఈ రెండు రంగాలకు పెద్దపీట వేస్తున్నట్లు బడ్జెట్ ప్రసంగం స్పష్టం చేసింది.

**పశుపోషణతో గ్రామీణ ఉపాధి**

రైతుల ఆదాయాన్ని పెంచడంలో పశుపోషణ రంగాన్ని మరో కీలకమైన అస్త్రంగా ప్రభుత్వం గుర్తించింది. గ్రామీణ, పాక్షిక – పట్టణ ప్రాంతాల్లో నాణ్యమైన ఉపాధి అవకాశాలు సృష్టించేందుకు పలు చర్యలను ప్రకటించారు. పశుపోషణ రంగంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు క్రెడిట్-లింక్డ్ సబ్సిడీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. పాడి, పౌల్ట్రీ, సంబంధిత కార్యకలాపాలలో చిన్న, మధ్య తరహా పరిశ్రమలు సులభంగా ప్రారంభించి, విస్తరించేందుకు ఇది మార్గం సుగమం చేస్తుంది. తద్వారా ప్రైవేట్ పెట్టుబడులు ఆకర్షించవచ్చు.

పశుపోషణ మౌలిక సదుపాయాలను ఆధునికీకరించడం పై కూడా బడ్జెట్‌లో దృష్టి సారించారు. మెరుగైన పశు ప్రజనన కేంద్రాలు, మేలైన దాణా వ్యవస్థలు, పశు ఆరోగ్య సేవలు, ఉన్నతమైన కోల్డ్ చైన్ లాజిస్టిక్స్‌ను అభివృద్ధి చేస్తారు.

ఈ ఆధునికీకరణతో పశుపోషణను కేవలం జీవనాధారం నుండి వ్యవస్థీకృత, మార్కెట్-ఆధారిత వ్యాపారంగా మార్చాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. పాడి, పౌల్ట్రీ రంగాలలో సేకరణ, ప్రాసెసింగ్, మార్కెటింగ్ సౌకర్యాలను పెంచడం ద్వారా సామర్థ్యాన్ని పెంచి, వ్యర్థాలను తగ్గించి, రైతులకు అదనపు విలువలో ఎక్కువ వాటా దక్కేలా చూడనున్నారు.

**మత్స్య రంగానికి సమగ్ర చేయూత**

దేశ వ్యవసాయ జీడీపీలో, ఉపాధి కల్పనలో కీలక పాత్ర పోషిస్తున్న మత్స్య రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం నడుం బిగించింది. ఇందులో భాగంగా, 500 జలాశయాలు, 'అమృత్ సరోవర్'లను సమీకృతంగా అభివృద్ధి చేయనున్నట్లు ప్రకటించారు. ఈ జలాశయాలు ఒకవైపు సాగునీటి అవసరాలు తీరుస్తూనే, మరోవైపు చేపల పెంపకానికి అనువుగా మారనున్నాయి.


ముఖ్యంగా తీర ప్రాంతాల్లో స్టార్టప్‌లు, మహిళా సంఘాలు, మత్స్యకార రైతు ఉత్పత్తిదారుల సంఘాలను (ఎఫ్ఎఫ్‌పిఓలు) భాగస్వామ్యం చేసి విలువ గొలుసును (వాల్యూ చైన్) పటిష్టం చేయనున్నారు. నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచడంతో పాటు, మారుతున్న వాతావరణ పరిస్థితులను తట్టుకునేలా ఈ ప్రణాళిక దోహదపడుతుంది. ■

# సహకార ఉద్యమ సారథికి పద్మశ్రీ పురస్కారం!

పశుపోషణ, పాడి పారిశ్రామిక రంగాల్లో విశేష సేవలందించిన కీర్తిశేషులు మామిడి రామారెడ్డికి (82) మరణానంతరం కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారాన్ని ప్రకటించింది. శ్రీ రామారెడ్డికి ఈ పురస్కారం రావడంపట్ల పలువురు ప్రముఖులు హర్షం వ్యక్తంచేశారు. అయితే ఈ పురస్కారం ఆయన జీవించివుండగానే లభించివుంటే మరింత అర్థవంతంగా వుండేదని వారు అభిప్రాయపడ్డారు.

**జీవితకాలపు సేవలకు గుర్తింపు**

శ్రీ రామారెడ్డికి పద్మశ్రీ లభించడం తనకు ఎంతో గర్వకారణంగా వున్నదని ఆయన భార్య హర్షం వ్యక్తంచేశారు. 'పాడి పరిశ్రమ, పశుపోషణ రంగాలకు జీవితాంతం ఆయనచేసిన సేవలకు సరైన గుర్తింపు' అని ఆమె పేర్కొన్నారు. శ్రీ రామారెడ్డి ఎంతో క్రమశిక్షణ కలిగినవారని, నియమబద్ధంగా సమయపాలన పాటించేవారని, ఎందరి జీవితాలలోనో వెలుగులు నింపినందుకే ఆయనకు ఈ పురస్కారం లభించిందని ఆమె అభిప్రాయపడ్డారు.



శ్రీ రామారెడ్డికి పద్మశ్రీ ప్రటించడం పట్ల ఏపిమాస్ సి ఇ ఓ, ఎం డి శ్రీ సి ఎస్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. సహకార రంగ అభివృద్ధి కోసం అంకితభావంతో, అవిశ్రాంతంగా సాగించిన కృషికి తగిన గుర్తింపు లభించిందని ఆయన అన్నారు. శ్రీ రామారెడ్డికి స్మృత్యంజలి పూర్వకంగా ఏపిమాస్ వివిధ కార్యక్రమాలను నిర్వహించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేసుకున్నారు.

**సి డి ఎఫ్ , ముల్కనూర్ డెయిరీ**

రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌కు చెందిన శ్రీ మామిడి రామారెడ్డి అమెరికాలో ఉన్నత విద్యాభ్యాసం చేశారు. ఆయన తండ్రి భోజారెడ్డి రంగారెడ్డి జెడ్పీ చైర్‌పర్సన్‌గా పని చేశారు. ఆ బాటలో రాజకీయాల్లోకి ప్రవేశించి శంషాబాద్ సర్పంచ్‌గా, రాజేంద్రనగర్ పంచాయతీ, రాజేంద్రనగర్ సమితి అధ్యక్షుడిగా పని చేశారు. అనంతరం రాజకీయాలను వదిలేసి, రాజేంద్రనగర్ ప్రాంతంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఏర్పాటు, అభివృద్ధిపై దృష్టి పెట్టి, 'సి డి ఎఫ్' (కో–ఆపరేటివ్ డెవలప్‌మెంట్ ఫౌండేషన్)ను ఏర్పాటు చేశారు. పశుపోషణ, పాడినిర్వహణ, పొదుపుఅంశాల్లో లక్షలాదిమంది రైతులకు శిక్షణ ఇచ్చారు. హన్మకొండ జిల్లా ముల్కనూరులో మహిళా డెయిరీని కూడా ప్రారంభించారు. ఇప్పటికీ కొనసాగుతున్న ఆ డెయిరీ ఇప్పుడు ఏటా రూ.200 కోట్ల టర్నోవర్ చేస్తుండటం గమనార్హం. దీని ద్వారా గ్రామీణ సమాజాలకు స్థిరమైన జీవనోపాధి అవకాశాలు మరింత విస్తరించాయి.

తొలుత 'సహకార అభివృద్ధి ఫౌండేషన్' (సి డి ఎఫ్) గా, తరువాత 'సహవికాస' గా పేరొందిన సంస్థను ఏర్పాటుచేసి, తెలంగాణ రాష్ట్రంలోని అప్పటి వరంగల్, కరీంనగర్ జిల్లాలలో మహిళలు, పురుషుల కోసం 550 స్వావలంబన పొదుపు,రుణ సహకార సంఘాల ఏర్పాటులో కీలక పాత్ర పోషించారు. ఈ సహకార సంఘాలు నేడు తమ సభ్యుల స్వంత పొదుపులు, అంతర్గత రుణాల వడ్డీ ఆదాయం ద్వారా మొత్తం రూ.570 కోట్లకు పైగా నిధులను నిర్వహిస్తున్నాయి.'భారత క్షీరవిప్లవ పితామహుడు' డా.వర్గీస్ కురియన్‌తో పాటు శ్రీ ఎల్.సి.జైన్, శ్రీ మోహన్ ధారియా వంటి జాతీయ స్థాయి ప్రముఖులతో సన్నిహితంగా పనిచేస్తూ, భారతదేశంలో సహకార సంస్కరణలకు రూపకల్పన చేయడంలో కీలక పాత్ర వహించారు. ప్రభుత్వ జోక్యం లేకుండా ప్రాథమిక సహకార సంఘాలు నడిచేలా పోరాడారు.ఆయన పోరాటంతోనే రాష్ట్రం, కేంద్రం కూడా సంఘాలకు రక్షణ కల్పిస్తూ చట్టాలు చేశాయి. గత ఏడాది అక్టోబరులో శ్రీ రామారెడ్డి కన్నుమూశారు.

శ్రీ రామారెడ్డి దార్శనికుడైన సంస్కర్తగా, భారతదేశ ఆధునిక సహకార ఉద్యమ ముఖ్య శిల్పుల్లో ఒకరిగా విశేష



*ఢిల్లీలో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకలలో శ్రీ రామారెడ్డి సతీమణికి సన్మానం*

సేవలు అందించారు. ప్రజాసంస్థలను, ప్రజాస్వామ్య సహకార సంఘాలను దేశవ్యాప్తంగా బలోపేతం చేయడానికి ఆయన అసాధారణమైన కృషి చేశారు.

1995లో అమలులోకి వచ్చిన ఆంధ్రప్రదేశ్ / తెలంగాణ మ్యూచువల్లి ఎయిడెడ్ కోఆపరేటివ్ సొసైటీస్ చట్టం (మాక్స్ యాక్ట్) రూపకల్పన, ప్రచారంలో ఆయన పోషించిన కీలక పాత్ర సహకార ఉద్యమానికి ఆయన చేసిన చిరస్మరణీయ సేవగా చరిత్రలో నిలిచిపోతుంది. ఈ చట్టం సహకార సంఘాలకు స్వయంప్రతిపత్తిని, ప్రజాస్వామ్య నియంత్రణను కల్పించింది. ఈ సంస్కరణ రూపకల్పనలో డా. జయప్రకాశ్ నారాయణ్, శ్రీ సంపత్, అలాగే అప్పటి సహకార శాఖకు చెందిన ఐ ఏ ఎస్ అధికారి శ్రీ భాలే రావు గారితో సన్నిహితంగా కలిసి పని చేశారు.

జాతీయ స్థాయిలో, శ్రీ రామారెడ్డిగారు ఆనంద్‌కు చెందిన 'ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ మేనేజ్‌మెంట్'(ఇర్మా) పాలకమండలి సభ్యుడిగా సేవలందించారు. అలాగే డా.జయప్రకాశ్ నారాయణ్ స్థాపించిన ఫౌండేషన్ ఫర్ డెమొక్రాటిక్ రీఫార్మ్స్' (ఎఫ్‌డిఆర్)లో కూడా కీలకపాత్ర పోషించారు. ఇంతే కాకుండా, భారత ప్రభుత్వం ఏర్పాటు చేసిన వైద్యనాథన్ కమిటీలో సభ్యుడిగా సహకార సంస్కరణలపై విధానపరమైన ముఖ్యమైన మార్పులకు గణనీయమైన సహకారం అందించారు. ప్రజాస్వామ్య సంస్థలు, గ్రామీణ నాయకత్వం, ప్రజా కేంద్రీకృత అభివృద్ధి పట్ల ఆయన జీవితాంతం చూపిన నిబద్ధత ద్వారా, శ్రీ రామారెడ్డి భారతదేశం అంతటా సహకార ఉద్యమాలకు ప్రేరణనిచ్చే అమూల్యమైన వారసత్వాన్ని మనకు అందించి వెళ్ళారు.

**శ్రీ రామారెడ్డి: ప్రముఖుల ప్రశంసలు**

*'శ్రీ రామారెడ్డి సాత్విక యోధుడు, అంకితభావంతో కూడిన నాయకుడు, ముఖ్యంగా మంచి మనిషి. ఎన్జీఓల ప్రోత్సాహంలో ప్రభుత్వ నియంత్రణ ఉండకూడదన్నది శ్రీ రామారెడ్డి గారి దృఢమైన అభిప్రాయం'*

**– శ్రీ సి ఎస్ రెడ్డి**

'కోట్ల రూపాయల నిధులు నిర్వహించినప్పటికీ, ఆయన ఎల్లప్పుడూ నేలపై నిలబడి క్షేత్రస్థాయి కార్యకర్తలతో కలిసి పనిచేశారు. సమయపాలన ఆయన అత్యంత ముఖ్యమైన వ్యక్తిగత విలువలలో ఒకటి. శ్రీ రామారెడ్డి జ్ఞాన, కర్మ మార్గాలలో ప్రజలకు మార్గ నిర్దేశం చేసిన శ్రీకృష్ణుడిలాంటి వారు'

**– శ్రీమతి జయప్రద**

*'శ్రీ రామారెడ్డితో గడిపిన ప్రతి సందర్భం ఎంతో ప్రేరణనిస్తుంది'.*

**– శ్రీ భాలేరావు**

*'శ్రీ రామారెడ్డిగారిది ఒక అరుదైన వ్యక్తిత్వం. ఆయన మౌన స్వభావం, సరళత, నిబద్ధత అందరిపై చెరగని ముద్ర వేశాయి'*

**– శ్రీమతి నందితా రే**

*'శ్రీ రామారెడ్డి గారి ప్రభావం తరతరాల పాటు కొనసాగుతుంది. సహకార ప్రజాస్వామ్యానికి ఆయన చూపిన మార్గం భారత్‌కు ఆదర్శం'*

**– డా. జయప్రకాశ్ నారాయణ**

'ముందస్తు సంసిద్ధతకు, మౌలిక వసతులకు ఆయన యిచ్చిన ప్రాధాన్యత, ప్రాముఖ్యత, సమయపాలన, సంస్థాగత పరిపాలనలో ఆయన పాటించిన విశిష్ట రీతుల దృష్ట్యా, ఆయనను "ఆచార్యుడు"గా సంభావించాలి.

**– కృష్ణగోపాల్**

*ప్రభుత్వ నిధులతో పొదుపు, సహకార సంస్థల ప్రోత్సాహానికి శ్రీ రామారెడ్డి వ్యతిరేకం. ప్రజల నాయకత్వంలోని సంస్థలకే ఆయన మద్దతు ఉండేది'.*

– శ్రీమతి సంధ్యా రాణి

■

# 'పట్టణ' పోషకాహార సవాళ్ళపై సమన్వయ కార్యాచరణ!

- జాహ్నవి ఎర్రబెల్లి

పట్టణ ప్రాంతాల్లో కొనసాగుతున్న పోషకాహార లోపం, రక్తహీనత సమస్యలను ఎదుర్కొనే దిశగా హైదరాబాద్‌లోని ఏపిమాస్ ప్రధాన కార్యాలయంలో సంబంధిత శాఖాధికారుల సమన్వయ కార్యశాల నిర్వహించబడింది. శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ అధికారిణి శ్రీమతి రేణుక, ఆరోగ్యశాఖ నుండి డా. మురళీధర్, గోల్కొండ ప్రత్యేక వైద్య అధికారి డా. శ్రీకాంత్, యూసీడీ విభాగం నుండి ఇంద్ర సేన, ప్రాజెక్ట్ ఆఫీసర్ సునీతగారు, శ్రీ రవి నాయుడు, కన్సల్టెంట్, తదితర నిపుణులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.




ఏపిమాస్ పోషకాహార విభాగం డైరెక్టర్ డా.అరుణ, మాట్లాడుతూ, ప్రస్తుత సమాజంలో పోషణ, ఆరోగ్యం పైన అవగాహన పెరిగినప్పటికీ, శిశువుల, చిన్నారుల పోషణ, 6 నెలల వరకు కేవలం తల్లిపాలే యివ్వాలనే మార్గదర్శక సూత్రం, ఆహార వైవిధ్యం వంటి అంశాల్లో ఆచరణ వెనుకబడి వుందని, మహిళలలో రక్తహీనత శాతం 59% వరకు వుందని, దానివల్ల వారు ఎక్కువగా ప్రభావితమవుతున్నారని పేర్కొన్నారు. అవగాహన, ఆచరణ మధ్య ఉన్న ఈ అంతరాన్ని తగ్గించడమే ఈ కార్యక్రమం ముఖ్యఉద్దేశమని తెలిపారు.

పట్టణ పోషణ పథకం మూడు సంవత్సరాల పాటు 14 అంగన్‌వాడీ కేంద్రాలలో అమలైందని, ప్రస్తుత్తం కార్వాన్ ఐసిడిఎస్ సెక్టార్లోని 26 అంగన్‌వాడీ కేంద్రాలకు ఈ పథకాన్ని విస్తరించామని ఏపిమాస్ ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీమతి భువాని తెలిపారు. టీకాలు వేయించడం సంతృప్తికరంగా ఉన్నప్పటికీ, పాలిచ్చే తల్లులపై ఆహార పరిమితులు ఇంకా కొనసాగుతున్నాయని ఆమె చెప్పారు. ప్రభుత్వ పథకాలపై మరింత అవగాహన, శిక్షణ అవసరమని అన్నారు.

ఏపిమాస్ సి ఇ ఓ శ్రీ సి ఎస్ రెడ్డి మూడు సంవత్సరాల ప్రాజెక్ట్ అమలును సమీక్షిస్తూ, మెహదీపట్నం, కార్వాన్లో మంచి ఫలితాలు సాధ్యమయ్యాయని తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో విశ్వాసాలు, ఆచారాలు గ్రామీణ ప్రాంతాల కంటే భిన్నంగా ఉంటాయని, అందువల్ల ప్రవర్తన మార్పు వ్యూహాలను అందుకు తగినట్టు రూపొందించుకోవాలని చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాల మౌలిక వసతుల మెరుగుదల అవసరమని కూడా శ్రీ సి ఎస్ రెడ్డి పేర్కొన్నారు.

శ్రీమతి రేణుక గారు మూడు శాఖల సమన్వయంతో మంచి పని జరుగుతోందని ప్రశంసించారు. అంగన్‌వాడీ టీచర్లపై పని భారం ఎక్కువగా ఉందని, అయినప్పటికీ ఇంటి సందర్శనలను మరింత పటిష్ఠంగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. హైదరాబాద్‌లో పూర్తి ఐసిడిఎస్ కవరేజ్ అమలవుతోందని, కొన్ని కేంద్రాల్లో ఇంగ్లీష్ మీడియం ప్రీ-స్కూల్ విద్య ప్రారంభమైందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను, జిహెచ్ఎంసీ కమ్యూనిటీ హాళ్లను అంగన్‌వాడీలుగా ఉపయోగించే ప్రతిపాదనలు కూడా చర్చించారు.

**మార్పును తిరస్కరించేవాడు వినాశనం కోరుకునేవాడే ; అభివృద్ధి కోరుకోనిది ఒక్క శ్మశానం మాత్రమే !**

మెహదీపట్నం డీపీఓ శ్రీ ఎల్. ఇంద్రసేన పోషకలోపం గల పిల్లల కోసం సమాజంలో అవగాహన అవసరమని, స్వయం సహాయ సమావేశాల్లో ఏపిమాస్ బృందాలు చురుకుగా పాల్గొనాలని సూచించారు. వృద్ధ మహిళలు, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్ వ్యక్తులు, కిశోర బాలికలతో కొత్త సంఘాలను ఏర్పాటు చేయవచ్చని తెలిపారు. డా. మురళీధర్ మాట్లాడుతూ ఆరోగ్య పరిరక్షణ, పోషకాహారం పట్ల సమాజం దృష్టి కేంద్రీకరించేలా చూడాల్సిన అవసరం ఉందన్నారు. గర్భిణీలు, చిన్నారులకు పోషకాహార కిట్లను సక్రమంగా పంపిణీ చేయాలన్నారు.




ఎస్‌విపి చైర్‌పర్సన్ శ్రీమతి సునీత పాఠశాల ప్రాంగణాల్లో ఉన్న అంగన్‌వాడీలకు గర్భిణులు వస్తారా? వలంటీర్లు అంగన్ వాడీ టీచర్లకు ఎలా సహాయపడగలరు? పట్టణ ప్రాంతాల్లో సేవ చేయాలనుకునే సంస్థల ఆసక్తిని ఎలా వినియోగించు కోవాలి? అనే ప్రశ్నలతో చర్చకు మరింత పదును పెట్టారు.

అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, స్వయంసహాయ సంఘాల మహిళలతో చర్చలు నిర్వహించినపుడు అంగన్‌వాడీ సేవలను పెంపొందించాలని, అంగన్వాడీ కేంద్రంలో వండి పెట్టే భోజనంకు హాజరు తక్కువగా ఉండటం, మౌలిక వసతుల కొరతను నివారించాలని, ఇంటి సందర్శనలు తప్పనిసరిగా చేయాలని వివరించారు.

సమాజంలో ప్రవర్తన మార్పు కోసం భర్తలు, అత్తమామల భాగస్వామ్య కార్యక్రమాల నిర్వహణ, చిన్న విడియోలు, పాత్రధారణల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. పోషక లోపం గల పిల్లల తల్లి దండ్రుల్లో బాలామృతం వినియోగం పట్ల అవగాహన పెంచాలని, ఈ కార్యక్రమాలలో స్థానిక ప్రముఖులు మరింత కీలక పాత్ర వహించేలా చూడాలని వివరించారు.

కన్సల్టెంట్ శ్రీ రవి నాయుడు ఎన్‌ఎఫ్ హెచ్ ఎస్-5 డేటాను ప్రస్తావిస్తూ, ఐదేళ్లలోపు పిల్లల మరణాల్లో రెండొంతులు పోషకాహార లోపమే కారణమని చెప్పారు. తల్లిపాలు వెంటనే ప్రారంభించడం, ఆశాల నిర్దిష్ట ఇంటి సందర్శనలు ఎంత కీలకమో వివరించారు.

శ్రీ గంగాధర్ నిర్వహించిన టీమ్ బిల్డింగ్ కార్యక్రమంతో పరస్పర సహకారం మరింత బలపడింది. శ్రీమతి భవాని తదుపరి దశకు స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక అవసరమని తెలిపారు.

ఈ కార్యశాల ఫలితంగా పట్టణ ప్రాంతాల్లో పోషకాహార లోపాన్ని తగ్గించాలంటే శాఖల సమన్వయం, సమాజ భాగస్వామ్యం, ముందు వరుస సిబ్బంది బలోపేతం, నిరంతర సామర్థ్య అభివృద్ధి తప్పనిసరి అనే స్పష్టత అందరికీ కలిగింది ■



# 'పి4' బంగారు మిత్రలకు మూడు రోజుల శిక్షణ

– జి. శ్రీనివాస్

పేదరికం అనేది కేవలం ఆర్థిక లోపమే కాదు; అది అవకాశాల కొరత, సేవల అందుబాటు లోపం, ఆరోగ్యం, పోషణ సమస్యలు, అవగాహనలేమి, సామాజిక మద్దతు లేకపోవడం వంటి అనేక అంశాల సమ్మేళనం. ఈ వాస్తవాన్ని గ్రహించి, గ్రామస్థాయిలోనే పేదరికాన్ని సమగ్రంగా ఎదుర్కొనే లక్ష్యంతో అమలవుతున్న పి4 కార్యక్రమంలో బంగారు మిత్రలు కీలక పాత్ర పోషిస్తున్నారు. బంగారు కుటుంబాలకు మార్గనిర్దేశం చేస్తూ, ప్రభుత్వ సేవలను, స్థానిక వనరులను, సమాజాన్ని అనుసంధానం చేయడంలో బంగారు మిత్రల సేవలు అమూల్యమైనవి.




ఈ నేపథ్యంలో, 2026 జనవరి 19 నుండి 21 వరకు హైదరాబాద్ లోని ఏపిమాస్ ప్రధాన కార్యాలయంలోని శిక్షణ కేంద్రంలో యం ఇ ఐ ఎల్, ఏపిమాస్ ఆధ్వర్యంలో పి4 కార్యక్రమం కింద పని చేస్తున్న బంగారు మిత్రల కోసం మూడు రోజుల కార్యశాల, శిక్షణ నిర్వహించబడింది. ఈ కార్యశాలలో గుడ్లవల్లేరు, రామకుప్పం మండలాల నుండి 29 మంది బంగారు మిత్రలు, నలుగురు ప్రాజెక్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

**కార్యశాల లక్ష్యాలు :** ఈ మూడు రోజుల కార్యశాల, శిక్షణ కార్యక్రమం ఈ క్రింది లక్ష్యాలతో రూపుదిద్దుకుంది.

- ♦ పి4 కార్యక్రమం సమగ్ర విధానాన్ని, ఆశించిన ఫలితాలను బంగారు మిత్రలు పూర్తిగా అర్థం చేసుకోవడం
- ♦ బంగారు కుటుంబాలు సాధికారత సాధించడానికి అవసరమైన అవగాహనను, నైపుణ్యాలను బంగారు మిత్రలకు అందించడం
- ♦ గ్రామ సచివాలయాలు, ఫ్రంట్‌లైన్ కార్మికులు, ఎస్‌హెచ్‌జిలు, వివోలు, ఇతర శాఖలతో సమన్వయంగా పనిచేసే విధానాన్ని నేర్చుకోవడం
- ♦ బంగారు మిత్రలు తాము నిర్వహించవలసిన పాత్ర, బాధ్యతలు , జవాబుదారీతనం పై స్పష్టత పొందడం

**అవగాహనకు పునాది**

కార్యశాల తొలిరోజు డా. జి. అరుణ గారు, శ్రీ జి.శ్రీనివాస్ గార్ల సమన్వయం తో ఉదయం రిజిస్ట్రేషన్, ప్రార్థనతో ప్రారంభమైంది.

అనంతరం ఆటల ద్వారా నిర్వహించిన పరిచయ కార్యక్రమం బంగారు మిత్రల మధ్య సాన్నిహిత్యాన్ని పెంపొందించింది. వర్క్‌షాప్ షెడ్యూల్, ఆశించిన ఫలితాలు మరియు బాధ్యతల పంపిణీపై స్పష్టమైన అవగాహన కల్పించడంతో పాటు, వివిధ కమిటీలను ఏర్పాటు చేశారు.

బంగారు మిత్రలు తమ క్షేత్రస్థాయి అనుభవాలను పంచుకున్న అనంతరం శ్రీమతి ఎ. కళామణి పి4 కార్యక్రమం ఎందుకు అవసరమో, ఇది గ్రామాల్లో ఎలా మార్పు తీసుకురాగలదో వారితో లోతుగా చర్చించారు. బంగారు కుటుంబాలు ఎదుర్కొంటున్న సమస్యలను, బలహీనతలను గుర్తించి, వాటికి సాధ్యమైన పరిష్కార మార్గాలపై గ్రూప్ వర్క్ నిర్వహించబడింది.

తరువాత జరిగిన సెషన్లలో, "బంగారు కుటుంబాలకు

సాధికారత ఎందుకు అవసరం, ఎలా సాధించాలి?" అనే అంశంపై బ్రెయిన్ స్టార్మింగ్, రోల్ ప్లేలు నిర్వహించబడ్డాయి. ఇవి బంగారు మిత్రలకు వారి పాత్రపై మరింత స్పష్టతను ఇచ్చాయి. శ్రీ మహేశ్ అలగప్ప కమ్యూనికేషన్, ప్రేరణ నైపుణ్యాలపై ఇంటరాక్టివ్ సెషన్ నిర్వహించారు. కుమారి అక్షయ , శ్రీ జి. శ్రీనివాస్ జీవనోపాధిపై పోస్టర్ రూపకల్పన కార్యక్రమం ద్వారా బంగారు మిత్రలు తమ ఆలోచనలను సృజనాత్మకంగా వ్యక్తపరచే అవకాశం కల్పించారు.

**సాధికారతకు మార్గదర్శనం**

రెండవ రోజు పునశ్చరణతో ప్రారంభమై, గత రోజు నేర్చుకున్న అంశాలపై చర్చ జరిగింది. బ్రాక్ సంస్థ నుండి శ్రీమతి భవ్య పాల్గొని ప్రధానంగా వ్యవసాయ, అనుబంధ జీవనోపాధులు, వాటి సాధ్యాసాధ్యాలు, స్థిరత్వం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. శ్రీ పి. గంగాధర్ వనరుల మ్యాపింగ్, గ్రామస్థాయిలో ఉన్న లోపాలు, అవసరాల గుర్తింపుపై గ్రూప్ ఎక్సర్‌సైజ్ నిర్వహించారు. బంగారు కుటుంబాల పేదరిక స్థాయిలను తగ్గించడానికి ప్రస్తుతం అందుబాటులో ఉన్న పథకాలు, సేవలు, వేదికలు ఏమిటి, వాటిలో ఉన్న లోపాలు (గ్యాప్‌లు) ఎలా పరిష్కరించాలి అనే అంశంపై లోతైన చర్చ జరిగింది. డా. అరుణ గారి ద్వారా బంగారు మిత్రలు రూపొందించిన పోస్టర్లపై ప్రదర్శన, చర్చ జరిగింది.

**అమలుకు సన్నద్ధంగా ...**

మూడవ రోజు పునశ్చరణతో ప్రారంభమై, శ్రీమతి సైదాబీ గారు, శ్రీ రఘురాం గార్ల ద్వారా భాగస్వామ్య పక్షాలతో, గ్రామ సచివాలయంతో, అంగన్‌వాడీ కేంద్రాలతో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో, ఎస్‌హెచ్‌జిలతో, విఓలతో సమన్వయం ఎలా ఉండాలనే అంశంపై గ్రూప్ ఎక్సర్‌సైజ్ నిర్వహించారు. ఆరోగ్యం, విద్య, జీవనోపాధి, నైపుణ్యాభివృద్ధి వంటి కీలక వ్యూహాల అమలు మార్గదర్శకాలపై బృందంలో చర్చించి, వాటిని సమగ్రంగా క్రోడీకరించారు. ఆరోగ్యం, పోషకాహారం గురించి శ్రీమతి యల్.భవాని వివరించారు.

అనంతరం శ్రీ చింతయ్య, శ్రీ వినాయక రెడ్డి ద్వారా బంగారు మిత్రల పాత్ర, బాధ్యతలపై ప్రత్యేక చర్చ జరిగింది. శ్రీ వసంత్, కుమారి అక్షయ ద్వారా ఎఫ్‌డిపి టూల్ (కోబో), రిపోర్టింగ్ ఫార్మాట్లు, డ్యాష్‌బోర్డ్ వినియోగంపై ఇంటరాక్టివ్ సెషన్ నిర్వహించబడింది.

**సుస్థిర జీవనోపాధులు**

మూడవ రోజు మధ్యాహ్నం శ్రీ సి.ఎస్. రెడ్డి సహభాగ పద్ధతిలో (పార్టిసిపేటరీ మెథడ్) బంగారు మిత్రలకు నిర్వహించిన సెషన్ ఎంతో ఆకట్టుకున్నది. ఈ సెషన్ ద్వారా బంగారు మిత్రలు అనేక కీలక అంశాలను నేర్చుకున్నారు.

ముఖ్యంగా పేదరికం అంటే ఏమిటి? సుస్థిర జీవనోపాధులు (సస్టెయిన్‌బుల్ లైవ్‌లీహుడ్స్) అంటే ఏమిటి? వాటిని ఎలా ప్రోత్సహించాలి? అనే విషయాలపై బజ్ గ్రూప్ ఎక్సర్‌సైజ్‌ల ద్వారా చర్చ జరిగింది. అలాగే బంగారు కుటుంబాలకు సాధ్యమైన లింకేజీలు ఏమిటి? అనే అంశంపై బ్రెయిన్‌స్టార్మింగ్ చర్చ నిర్వహించబడింది.

బంగారు మిత్రలకు అవసరమైన గుణాలు, నైపుణ్యాలు, జ్ఞానం గురించి రౌండ్ రాబిన్ విధానంలో అందరి భాగస్వామ్యంతో జాబితా రూపొందించారు. ఈవిధంగా విభిన్న పద్ధతులను ఉపయోగిస్తూ అందరినీ చురుకుగా పాల్గొనేలా సెషన్ నిర్వహించబడింది. సెర్ప్ డైరెక్టర్ శ్రీ కృష్ణమూర్తి పి4 ద్వారా దివ్యాంగులకు చేయూతనిచ్చే విధానం. దివ్యాంగ కుటుంబాల అవసరాలు, హక్కులు, జీవనోపాధి అవకాశాలపై స్పష్టమైన అవగాహన కల్పించారు.

ఈ కార్యశాల కార్యక్రమంలో మేఘా ఇంజనీరింగ్ సంస్థ (యంఇఐఎల్) నుండి శ్రీ యం జి వి కె భాను గారు పాల్గొని, బంగారు మిత్రలు బంగారు కుటుంబాలను తమ కుటుంబాలు లాగానే భావించి పని చేయాలని ప్రోత్సహించారు. శిక్షణ ఫలితాలపై సంతృప్తి వ్యక్తం చేస్తూ, ఏపిమాస్ తో సంయుక్తంగా తాము పనిచేస్తున్న రెండు మండలాలలో రాబోయే మూడు నెలల్లో ఒకొక్క గ్రామాన్ని ఎంపిక చేసి వృద్ధుల సంరక్షణ కార్యక్రమాన్ని అమలు చేయాలని సూచించారు. బంగారు మిత్రలకు అప్రాన్స్, వాటర్ బాటిల్స్ బహూకరించి, బంగారు మిత్రల అభిప్రాయ సేకరణతో కార్యశాల ముగిసింది.

**వివేకం వంద ఏళ్ళుగా చేసిన కృషిని అవివేకం ఒక్క క్షణంలో భస్మంచేస్తుంది**



కౌన్సిలింగ్, ప్రీ–యూనిట్ శిక్షణ, నిరంతర పర్యవేక్షణ వంటి పద్ధతులు స్థిరమైన ఫలితాలకు దోహదపడతాయని శిక్షణలో స్పష్టత వచ్చింది.

**కార్యశాల ఫలితాలు: క్షేత్రస్థాయి సిద్ధత**

ఈ మూడు రోజుల కార్యశాల బంగారు మిత్రలలో కేవలం అవగాహననే కాకుండా, వారి దృక్పథంలో మార్పును తీసుకొచ్చింది, క్షేత్రస్థాయిలో అమలు చేయగల నైపుణ్యాలను సమకూర్చింది. ప్రారంభంలోనే బంగారు మిత్రలు స్వచ్ఛందంగా కమిటీలను ఏర్పాటు చేసుకొని, బాధ్యతలను పంచుకోవడం ద్వారా సమూహ బాధ్యత భావనను పెంపొందించారు.

అనుభవాలను పంచుకోటం, అంచనాల మ్యాపింగ్ ద్వారా బంగారు కుటుంబాలతో పని చేయడంలో ఎదురయ్యే వాస్తవ సమస్యలు, నమ్మకం కలిగించడం, కమ్యూనికేషన్ లోపాలు, రాజకీయ ఒత్తిడులు, జీవనోపాధి వైఫల్యాలు, వృద్ధుల అవసరాలు వంటి అంశాలు స్పష్టంగా బయట పడ్డాయి. పి4 కార్యక్రమంలో లక్ష్యాలతోపాటు ప్రక్రియ కూడా ముఖ్యం అన్న దృష్టికోణాన్ని ఈ శిక్షణ నొక్కి చెప్పింది.

బంగారు కుటుంబాల ఆలోచనా విధానంలో ఉన్న పేదరికాన్ని తొలగించడం, కుటుంబస్వామ్య భావనను పెంపొందించడం, స్వయం ఆధారత వైపు నడిపించడం వంటి అంశాలు ప్రధానంగా చర్చించబడ్డాయి.

**జీవనోపాధి ప్రణాళిక – స్థిరత్వంపై దృష్టి**

శిక్షణలో జీవనోపాధి అంశానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వబడింది. ఇప్పటికే ఉన్న జీవనోపాధులను బలోపేతం చేయడం, కుటుంబ సామర్థ్యాలు, ఆశక్తులను, ఆశయాలను పరిగణనలోకి తీసుకొని కొత్త జీవనోపాధులను సూచించాల్సిన అవసరాన్ని బంగారు మిత్రలు అర్థం చేసుకున్నారు. కుటుంబ స్థాయి చర్చలు, ఆదాయం–వ్యయం విశ్లేషణ, దశలవారీ

**వనరుల మ్యాపింగ్ : భాగస్వామ్య సమన్వయం**

గ్రామస్థాయిలో అందుబాటులో ఉన్న ఆరోగ్యం, విద్య, ఆర్థిక సేవలు, ప్రభుత్వ పథకాలను గుర్తించి, వాటిలో ఉన్న లోపాలను పూరించడంలో బంగారు మిత్రల పాత్ర ఎంత కీలకమో ఈ వర్క్‌షాప్ స్పష్టంగా చూపించింది. గ్రామ సచివాలయాలు, ఫ్రంట్‌లైన్ కార్మికులు, ఎస్‌హెచ్‌జిలు, విఓలతో సమన్వయంగా పనిచేయడం ద్వారా బంగారు కుటుంబాలకు సమగ్ర సేవలు అందించవచ్చని బంగారు మిత్రలు నేర్చుకున్నారు.

**దివ్యాంగులు, వృద్ధులపై ప్రత్యేక దృష్టి**

పి4 కార్యక్రమంలో దివ్యాంగుల, వృద్ధ బంగారు కుటుంబాల కోసం ప్రత్యేక శ్రద్ధ అవసరమని ఈ శిక్షణలో నొక్కి చెప్పారు. ఉపశమన పద్ధతులకే పరిమితం కాకుండా, సాధికారత దిశగా కార్యక్రమాలను రూపొందించాల్సిన అవసరాన్ని బంగారు మిత్రలు అర్థం చేసుకున్నారు.

**స్థిరమైన మార్పు దిశగా ...**

ఈ మూడు రోజుల శిక్షణ శిబిరం బంగారు మిత్రలకు ఆలోచనా స్పష్టత, కార్యాచరణ మార్గదర్శకాలు , నిర్వాహక నైతిక బలం అందించింది. బంగారు కుటుంబాల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే కాకుండా, వారి జీవితాల్లో గౌరవం, భద్రత, స్వయం ఆధారతను నెలకొల్పడమే పి4 కార్యక్రమం సారాంశం.

ఈ లక్ష్యాన్ని సాధించడంలో బంగారు మిత్రలు ముందు వరుసలో నిలబడి, గ్రామీణ సమాజంలో స్థిరమైన సామాజిక మార్పుకు మార్గదర్శకులుగా నిలుస్తారన్న నమ్మకాన్ని ఈ శిక్షణ మరింత బలపరిచింది. ■

ఆలోచనలు మారవచ్చు కాని సిద్ధాంతం కాదు, ఆకులు రాలవచ్చు కాని మూలం నశించకూడదు

# నిస్సహాయ మహిళలకు 'బంగారు' జీవనోపాధులు !

– చింతయ్య, రఘురామ్

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పి-4 ప్రాజెక్ట్‌లో స్వచ్ఛంద భాగస్వాములైన ఏపిమాస్, మేఘా ఇంజనీరింగ్ సంస్థ లు(యంఇఐఎల్) కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు మండలంలో చేపట్టిన మార్గదర్శి బంగారు కుటుంబాల కార్యక్రమంలో యిప్పటికే బంగారు కుటుంబాలను గుర్తించడమే కాకుండా, వారిలో పలువురికి సుస్థిర జీవనోపాధులను కల్పించే ఘట్టం పుంజుకుంటున్నది.




అర్హులైన లబ్ధిదారులకు గొర్రెలు, పందులు, చేపల పెంపకం, బట్టల వ్యాపారం, టైలరింగ్ వంటి జీవనోపాధులను కల్పించారు. మరికొందరికి త్వరలో యివి సమకూర్చడానికి రంగం సిద్ధమైంది. ఈ విధంగా జీవనోపాధులు ఏర్పరచుకున్న యిద్దరు మహిళల గురించి యిప్పుడు తెలుసుకుందాం.

**బట్టల వ్యాపారిగా మారిన ఒంటరి మహిళ ధనలక్ష్మి**

గుడ్లవల్లేరు మండలం కూచి కాయలపూడికి చెందిన 29 సంవత్సరాల శ్రీమతి కొల్లూరి ధనలక్ష్మి ఒక పేద కుటుంబానికి చెందిన మహిళ. వివాహం తర్వాత కొన్ని సంవత్సరాలు భర్తతో కలిసి జీవించింది. అయితే కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందుల వంటి కారణాలవల్ల ఆమె భర్తతో విడిపోయింది.

భర్తతో విడిపోయిన అనంతరం ధనలక్ష్మి తన పుట్టింటికి వచ్చి తల్లిదండ్రులతో కలిసి జీవిస్తోంది. అయితే, తల్లిదండ్రుల ఆరోగ్యం సరిగా లేకపోవడం వల్ల కుటుంబ బాధ్యతలు ఎక్కువగా ధనలక్ష్మి మీదే పడ్డాయి. కుటుంబపోషణ కోసం ఆమె గ్రామంలోని పొలాల్లో కూలీ పనులు చేసుకుంటూ ఉండేది. శారీరకంగా కష్టమైన పనులుచేసి కుటుంబాన్ని పోషిస్తుండేది. కాని, కొంతకాలంగా ధనలక్ష్మి ఆరోగ్యం బాగా క్షీణించింది. ఆస్తమా , కీళ్ల నొప్పులతో, ఆమె ఆరోగ్యం క్షీణించి పనులు చేయలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో ఆదాయం తగ్గిపోయింది. ఆర్థిక ఇబ్బందులు ఆమెను మానసికంగా కుంగదీయసాగాయి.

ఆ సమయంలో పి4 ప్రాజెక్ట్ ద్వారా మెగా కంపెనీ వారు ఆమెకు రూ.55,000 ఆర్థిక సహాయం అందించారు. ఈ సహాయంతో ధనలక్ష్మి తన ఆరోగ్యానికి అనుకూలంగా ఉండే ఉపాధి మార్గంగా బట్టల వ్యాపారం ప్రారంభించింది. ఈ మొత్తంతో బట్టలు కొనుగోలు చేసి స్వగ్రామంలో, పరిసర ప్రాంతాల్లో అమ్మడం మొదలుపెట్టింది.

ప్రస్తుతం ధనలక్ష్మి బట్టల వ్యాపారం ద్వారా స్థిరమైన ఆదాయం పొందుతోంది. ఈ ఉపాధి ఆమె ఆరోగ్యానికి కూడా అనుకూలంగా ఉండటంతో పాటు, తల్లిదండ్రులను, పిల్లలను చూసుకోవడంలో ఎటువంటి యిబ్బంది లేకుండున్నది. ఒక నిస్సహాయ మహిళకు సరైన మార్గ దర్శకత్వం అందితే ఆమె జీవితం గౌరవప్రదంగా సాగుతుందన డానికి ధనలక్ష్మి ఒక ఉదాహరణ.

**చేపల అమ్మకం సాగిస్తున్న వితంతువు దుర్గ**

గుడ్లవల్లేరు మండలం కౌతవరం గ్రామానికి చెందిన శ్రీమతి పాండ్రంగి దుర్గ అనే 49 సంవత్సరాల మహిళ జీవితం భర్త అకాల మరణంతో ఒక్కసారిగా ఒడ్డునపడ్డ చేపలాగా మారింది. సాధారణ కుటుంబానికి చెందిన దుర్గకు ఒక కొడుకు ఉన్నాడు. పెరాలసిస్ కారణంగా మంచానికే పరిమితమైన తల్లి ఉంది. భర్త అకాల మరణం వల్ల కుటుంబ

నీలో మార్పు రాకుండా ఇతరులలో మార్పు రావాలనుకోవడం అత్యాశ

# 30 వేల లీటర్ల 'అమృతజలం'... ఏడాది పొడవునా ఆరోగ్యం!

## వాన నీటిని తాగునీరుగా మార్చుకున్న మచ్కల్ మహిళ సూర్యవంశీ పద్మిని ఆదర్శగాథ

– మైత్రి ప్రవీణ్, రాజోజుల బ్రహ్మచారి

నీరే ప్రాణాధారం. కానీ, నేడు కలుషితమైన నీటితో ఎన్నో అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. ఫ్లోరైడ్ భూతం గ్రామీణ ఆరోగ్యాన్ని దెబ్బ తీస్తోంది. ఇలాంటి తరుణంలో, ప్రకృతి ప్రసాదించిన స్వచ్ఛమైన వర్షపు నీటిని ఒడిసిపట్టి, ఏకంగా 30 వేల లీటర్ల నీటిని నిల్వ చేసుకుంటూ, తన కుటుంబ ఆరోగ్యానికి రక్షణ కవచంగా మార్చుకున్నారు నిర్మల్ జిల్లా, ముధోల్ మండలం, మచ్కల్ గ్రామానికి చెందిన గృహిణి శ్రీమతి సూర్యవంశీ పద్మిని.



ధనలక్ష్మి మహిళా సంఘం సభ్యురాలిగా గ్రామీణ మహిళలు పొదుపుతో పాటు ఆరోగ్యం లోనూ ముందుండాలని నిరూపిస్తున్నారు పద్మిని గారు.

మచ్కల్ గ్రామంలోని 'ధనలక్ష్మి మహిళా సంఘం' సభ్యురాలైన ఆమె, కేవలం ఆర్థిక స్వావలంబనకే పరిమితం కాకుండా, కుటుంబ ఆరోగ్యంపై కూడా దృష్టి సారించి తోటి మహిళలకు ఆదర్శంగా నిలిచారు.

**ఇంటిలోనే జలనిధి**

సాధారణంగా, గ్రామీణ ప్రాంతాల్లో వర్షపు నీటి సేకరణపై పెద్దగా అవగాహన ఉండదు. కాని, పద్మిని గారు శ్రీ సాయినాథ్ గారి మాటలను స్ఫూర్తిగా తీసుకున్నారు. "వాన నీరు భూమిపై పడకముందే సేకరించగలిగితే, ఆ నీటిని మించిన స్వచ్ఛమైన నీరు మరొకటి లేదు, ఆ నీరు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది" అనే మాటలను ఆమె చక్కగా గ్రహించారు. ఆ ప్రేరణతోనే ఆమె తన ఇంటిని జలనిధిగా మార్చుకున్నారు. వర్షాకాలంలో ఇంటిపై పడే నీటిని వృథా పోనివ్వకుండా సుమారు 30,000 లీటర్ల సామర్థ్యం గల ట్యాంకులో నిల్వ చేస్తున్నారు.

**అధికారుల అండ ... సాంకేతిక తోడ్పాటు**

సంవత్సరం పొడవునా ఈ నీటినే తాగుతూ, ఎటువంటి అనారోగ్య సమస్యలు లేకుండా జీవిస్తున్న పద్మిని గారి కృషిని ఏపిమాస్ ప్రతినిధులు, సెర్ప్ అధికారులు గుర్తించారు. ఆమె

---

బాధ్యతలన్నీ ఆమె మీదే పడ్డాయి.

కుటుంబ పోషణలో భర్తకు తోడుగా నిలవడంకోసం, ఆమె గతంలో ఇంటింటికీ తిరిగి చేపలు అమ్మేది. కాని




భర్తమరణం తర్వాత చేపలు కొనుగోలు చేయటానికి సరిపడా ధనం లేక ఆమె చేపల వ్యాపారాన్ని నిలిపి వేయాల్సి వచ్చింది. ఆ కారణంగా, రోజువారీ అవసరాలు కూడా తీరని పరిస్థితి ఏర్ప డింది. ఆ సమయంలో పి4 మెగా బృందం వారు ఆమె పరిస్థితి గమనించి, ఆమెకు 40,000 ఆర్థిక సహాయం అందించారు. ఆ సహాయంతో ఆమె లైవ్ ఫిష్ సెంటర్‌ను ఏర్పాటు చేసుకున్నది. షాప్ ప్రారంభించిన తరువాత ప్రస్తుతం ఆమె రోజుకు సగటున రూ. 500 వరకు నికర ఆదాయం పొందుతూ కుటుంబ అవసరాలను తీర్చగలుగుతోంది. పాండ్రంగి దుర్గ జీవితం ధైర్యం, బాధ్యత, స్వయం ఆధారిత జీవనానికి ఉదాహరణ. ■

అధికారం, ధనం జీవన ఫలాలు ; కుటుంబం, మిత్రులు జీవన మూలాలు, మూలం లేని ఫలం మరణం!



ప్రయత్నానికి సాంకేతికతను జోడిస్తూ, నీటిని మరింత శుద్ధి చేసుకుని తాగడానికి వీలుగా, ఆమె నివాసంలో ఒక ప్రత్యేకమైన 'వడపోత ఫిల్టర్' ను అమర్చారు.

**ఆరోగ్య విప్లవానికి నాంది :** ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏపిమాస్ 'వాష్' తెలంగాణ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీ ఆర్. బ్రహ్మచారి మాట్లాడుతూ.. "చాలామంది ఫ్లోరైడ్ నీరు, లేదా కలుషిత నీటి వల్ల కీళ్ల నొప్పులతో, జీర్ణ సమస్యలతో బాధపడుతున్నారు. కానీ పద్మిని గారు ఎంచుకున్న ఈ మార్గం ఆదర్శనీయం.

ఆమె సుమారు 30వేల లీటర్ల నీటిని వర్షాకాలంలో నిల్వచేసి, సంవత్సరం పొడవునా అదే నీటిని తాగుతూ, తన కుటుంబ ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారు. ఇది కేవలం ఒక ఇంటికే పరిమితం కాకూడదు, గ్రామంలోని ప్రతి ఇంటికీ విస్తరించాలి," అని పేర్కొన్నారు.

జిల్లా సమన్వయకర్త శ్రీ మైత్రి ప్రవీణ్ మాట్లాడుతూ, "ఇలాంటి మంచి పనులకు ఏపిమాస్ సహకారం ఎప్పుడూ ఉంటుంది. పద్మిని గారు చూపిస్తున్న బాటలో నడిస్తే ఆసుపత్రుల చుట్టూ తిరిగే పని తగ్గుతుంది,'' అని ప్రశంసించారు.

**గ్రామస్తుల హర్షం :** ఈ కార్యక్రమంలో వి ఓ ఏ వినీత్, పద్మిని గారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. తమ గ్రామానికి చెందిన మహిళ, సాటి సంఘం సభ్యురాలు ... జిల్లా ,రాష్ట్ర స్థాయి అధికారుల మన్ననలు పొందడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

స్థానిక ఎమ్మెల్యే శ్రీ రామారావు పవర్ యిటీవల పద్మిని గారి నివాసాన్ని సందర్శించి, అక్కడ ఏర్పాటు చేసిన వర్షపు నీటి సేకరణ ప్రక్రియను పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహిళలు సంఘాలలో సభ్యులుగా ఉండి ఇటువంటి పర్యావరణహిత కార్యక్రమాలు చేపట్టడం ఎంతో హర్షణీయమని అన్నారు. ఈ ప్రక్రియ కొంత ఖర్చుతో కూడుకున్నదైనా, సంఘ మహిళలకు వివిధ రకాల రుణ సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని, వాటిని ఉపయోగించి ఇలాంటి వర్షపు నీటి సేకరణ విధానాలను అమలు చేయడం ద్వారా కుటుంబానికి మాత్రమే కాకుండా సమాజానికి, భూమికి కూడా మేలు చేసినట్టవుతుందని అన్నారు.

ఈ తరహా కార్యక్రమాలకు సంఘాలలో, గ్రామ సంఘాలలో మరింత ప్రోత్సాహం కల్పించాలని, ఇందుకు ఏపిమాస్ లాంటి సంస్థల సహకారం తీసుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్న ఏపీఎం గురుచరణ్ గారిని, ఏపిమాస్ ప్రాజెక్ట్ అధికారి మైత్రి ప్రవీణ్ గారిని ఎమ్మెల్యే గారు ప్రత్యేకంగా ప్రశంసించారు. ■

## ఏపీఎస్ఆర్టీసీకి జాతీయ అవార్డు

**ఆం**ధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్ఆర్టీసీ)కు మరో జాతీయ అవార్డు దక్కింది. రాష్ట్రవ్యాప్తంగా బస్టాప్‌లలో ఆటోమేటిక్ అనౌన్స్‌మెంట్ సిస్టమ్ (ఏఏఎస్) విజయవంతంగా అమలు చేసినందుకు గానూ ఏపీఎస్ఆర్టీసీకి ప్రతిష్ఠాత్మకమైన గవర్నెన్స్ నౌ – 6వ డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సమ్మిట్ అవార్డ్ వరించింది.

ఈ అవార్డు ద్వారా ప్రయాణికుల సౌకర్యార్థం డిజిటల్ సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించిన ఏపీఎస్ఆర్టీసీ కృషికి జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. ■

# 'పద్మ' సరోవరంలో మహిళా వికాసం!

**క**లం పట్టినా, హలం పట్టినా.. సామాజిక మార్పు కోసం నడుం బిగించినా మహిళా శక్తికి సాటిలేదని ఈ ధీరవనితలు నిరూపించారు. తమదైన ముద్రతో సమాజ గమనాన్ని మార్చిన శివశంకరి, ఎస్.జి.సుశీలమ్మ, కొల్లక్కయిల్ దేవకి, విమలా మీనన్‌లను ఈ ఏడాది పద్మశ్రీ పురస్కారాలు వెతుక్కుంటూ వచ్చాయి. అక్షరం, ప్రకృతి, సేవ, కళ.. ఇలా విభిన్న రంగాల్లో వారు చేసిన కృషికి ఈ గౌరవం దక్కింది.

## అక్షర సేతువు

**త**మిళ సాహిత్య వినీలాకాశంలో ధృవతారగా వెలుగుతున్న శివశంకరిని కేంద్ర ప్రభుత్వం 'పద్మశ్రీ' పురస్కారంతో గౌరవించడం అక్షర లోకానికే గర్వకారణం. ఐదు దశాబ్దాలకు పైగా తన కలం ద్వారా సామాజిక ముఖ



చిత్రాన్ని ఆవిష్కరించిన ఆమె కేవలం రచయిత్రి గానే కాకుండా ఒక సామాజిక విశ్లేషకురాలిగా దేశ ప్రజల గుండెల్లో చెరగని ముద్రవేశారు. అక్షరాల ద్వారా దేశాన్ని ఏకం చేయాలనే ఆమె తపనకు ఈ పౌర పురస్కారం ఒక సముచిత గౌరవం. శివశంకరి రచనలు ఎప్పుడూ వాస్తవానికి దగ్గరగా ఉంటాయి. మధ్యతరగతి కుటుంబాలలోని మనో వేదనలు, స్త్రీల అంతరంగ మథనం, సామాజిక దురాచారాలను ఆమె తన రచనల్లో సూటిగా ప్రశ్నిస్తారు.

ముఖ్యంగా డ్రగ్స్, మద్యపానం వంటి వ్యసనాల వల్ల కుటుంబాలు ఎలా ఛిన్నాభిన్నం అవుతున్నాయో ఆమె కళ్లకు కట్టినట్టు చూపారు. పాఠకుల నాడి తెలిసిన రచయిత్రిగా ఆమె రాసిన అనేక నవలలు వెండితెరపైనా సంచలనం సృష్టించాయి. ఆమె సాహిత్య ప్రస్థానంలో తలమానికం వంటిది 'నిట్ ఇండియా త్రూ లిటరేచర్' ప్రాజెక్ట్. భారతదేశం వంటి భిన్నత్వంతో కూడిన దేశాన్ని సాహిత్యం ద్వారా ఎలా ఏకం చేయవచ్చో ఆమె నిరూపించారు. ఇందుకోసం ఆమె ఏకంగా 16 ఏళ్లపాటు దేశంలోని నాలుగు దిక్కులా పర్యటించారు. 18 భారతీయ భాషలకు చెందిన ప్రసిద్ధ రచయితలను కలుసుకుని వారి సంస్కృతిని, సాహిత్యాన్ని అధ్యయనం చేసి నాలుగు భారీ సంపుటాలను వెలువరించారు. ఇది భారతీయ సాహిత్య చరిత్రలో ఒక అరుదైన, సాహసోపేతమైన ప్రయత్నం.

శివశంకరి రాసిన 'సూర్యవంశం' అనే స్మృతి చిత్రాలు ఆమె వ్యక్తిగత ప్రయాణంతోపాటు ఒక తరం సామాజిక మార్పులను రికార్డు చేశాయి. ఈ రచనకు గాను ఆమెకు ఇప్పటికే ప్రతిష్ఠాత్మక 'సరస్వతీ సమ్మాన్' దక్కింది. ఇప్పుడు దక్కిన 'పద్మశ్రీ' పురస్కారం ఆమె నిబద్ధతకు, సాహిత్య కృషికి దేశం సమర్పించిన నీరాజనం. భాషలు వేరైనా, భావం ఒక్కటేనని చాటిచెప్పిన శివశంకరి అక్షర ప్రయాణం రాబోయే తరాలకు గొప్ప స్ఫూర్తిపాఠం.

## అనాథల పాలిట అమ్మ

**ని**శ్శబ్దంగా వేలాదిమంది జీవితాల్లో వెలుగులు నింపిన వారు కొందరే ఉంటారు. అటువంటి వారిలో ఒకరు కర్ణాటకకు చెందిన ఎస్.జి.సుశీలమ్మ. అనాథలు, అభాగ్యుల పాలిట కల్పవల్లిగా మారిన ఆమెను కేంద్ర ప్రభుత్వం 'పద్మశ్రీ' పురస్కారంతో గౌరవించడం సామాజిక సేవా రంగానికి దక్కిన గౌరవం. దశాబ్ద కాలంగా ఆమె చేస్తున్న నిరంతర కృషికి ఈ అత్యున్నత పురస్కారం ఒక చిన్న గుర్తింపు మాత్రమే.

సుశీలమ్మ సేవా ప్రస్థానం నేటిది కాదు. దాదాపు ఆరు దశాబ్దాల కిందటే ఆమె హృదయం సమాజంలోని అట్టడుగు వర్గాల కోసం ద్రవించింది. కేవలం రూ. 15 నగదుతో ముగ్గురు అనాథ పిల్లలను చేరదీసి ఒక అద్దె ఇంట్లో ప్రారంభించిన ఆమె ప్రయాణం నేడు 'సుమంగళి సేవా

ధనముంటే ధనవంతుడు అంటారు, ఆ ధనంతో ఇతరుల కష్టాలు తీరిస్తే భగవంతుడు అంటారు



ఆశ్రమం' అనే ఒక మహా సంస్థగా రూపాంతరం చెందింది. సంపద లేక పోయినా సేవాగుణం ఉంటే కొండంత పని చేయవచ్చని ఆమె నిరూపించారు. అనాథ పిల్లలకు ఆమె ఆశ్రయం ఇవ్వడమే కాదు, వారిని విద్యావంతులుగా తీర్చిదిద్ది సమాజంలో గౌరవ ప్రదమైన స్థానాల్లో నిలబెట్టారు.

సుశీలమ్మ కేవలం పిల్లలకే పరిమితం కాలేదు. గృహహింసకు గురై సమాజం వెలివేసిన మహిళలకు ఆమె ధైర్యాన్ని ఇచ్చారు. సుమంగళి సేవా ఆశ్రమం ద్వారా వేలాదిమంది మహిళలకు వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ ఇచ్చి వారు ఆర్థికంగా నిలబడేలా చేశారు. ఒక మహిళ స్వయం సమృద్ధి సాధిస్తే ఒక కుటుంబం మొత్తం బాగుపడుతుందన్న గాంధేయ సిద్ధాంతాన్ని ఆమె ఆచరణలో చూపారు. ఆమె పెంచిన పిల్లలు, ఆమె ఆశ్రయంలో ఆసరా పొందిన మహిళలు నేడు ఆమెను 'అమ్మ' అని పిలుచుకుంటారు.

వయసు పైబడుతున్నా సుశీలమ్మలో ఉత్సాహం ఏమాత్రం తగ్గలేదు. గ్రామీణ ప్రాంతాల్లో అక్షరాస్యతను పెంచడం, మహిళల ఆరోగ్య రక్షణ, వృద్ధులకు ఆసరా కల్పించడం వంటి అనేక కార్యక్రమాలను ఆమె ఇప్పటికీ పర్యవేక్షిస్తున్నారు. ప్రచార ఆర్భాటం లేకుండా ఆమె చేసిన సేవలు ఎందరికో మార్గదర్శకంగా నిలిచాయి. పద్మశ్రీ పురస్కారం ఆమె ఇంటి తలుపు తట్టడం ద్వారా భారత ప్రభుత్వం ఒక నిబద్ధత కలిగిన సేవామూర్తిని సరైన సమయంలో గుర్తించిందని చెప్పవచ్చు.

## 40 ఏళ్ళ 'మొక్క'వోని దీక్ష

**కొ**ల్లక్కయిల్ దేవకీ అమ్మకు ప్రకృతే బడి, గుడి. 'నేల ఎప్పుడూ పచ్చగా ఉంటేనే మనిషికి మనుగడ' అని చెప్పడమే కాదు, పచ్చదనం కోసం నలభయ్యేళ్ళుగా పాటుపడుతున్నారు. రోజుకు ఒక్క మొక్క అయినా నాటడాన్ని ఒక యజ్ఞంలా కొన సాగిస్తున్నారు. దేవకీ అమ్మ స్వస్థలం కేరళ లోని ముత్తుకులమ్ గ్రామం. 1934లో వ్యవసాయ కుటుంబంలో పుట్టిన ఆమెకు బాల్యం నుంచి వ్యవసాయ పనులు అలవాటే. వివాహం తరువాత ... భర్త గోపాలకృష్ణ పిళ్ళై ఉపాధ్యాయ వృత్తిలో నిమగ్నమైతే... పొలం పనులను దేవకి చూసేవారు. కానీ కారు ప్రమాదానికి గురై, ఆమె పాదాలు బలహీనం కావడంతో... వ్యవసాయ పనులు చేయడం కష్టమయ్యేది. "పొలానికి వెళ్ళకుండా ఇంట్లో కూర్చోవడం ఆమెకు కష్టమయింది. ఇప్పుడే భర్త సూచనతో.... తమ తోటలో మొక్కలు పెంచడం ఆరంభించారు. ఇప్పటివరకూ అయిదు వేలకు పైగా మొక్కలు నాటారు. వాననీటి సంరక్షణ పద్ధతులు చేపట్టారు.



నాలుగు దశాబ్దాల ఆమె కృషి ఇప్పుడు ఒక అడవిగా రూపుదిద్దుకుంది. అపురూపమైన ఎన్నో మొక్కలతో కళకళలాడుతోంది. వలస పక్షులకు విడిదిగా మారింది. తొంభయ్యేళ్ళు దాటినా ఇప్పటికీ ఆమెలో ఉత్సాహం, పర్యావరణ పరిరక్షణకోసం ఏదైనా చేయాలనే తపన తగ్గలేదు. రసాయన ఎరువులు, పురుగుల మందుల వినియోగాన్ని గట్టిగా వ్యతిరేకించే దేవకి తోటలో సేంద్రియ పద్ధతులనే అనుసరిస్తారు. ఆమె చేతుల మీదుగా రూపుదిద్దుకున్న ఆ తోట... ప్రకృతి ప్రేమికులతో పాటు విద్యార్థులను, పరిశోధకులకు సందర్శన స్థలంగా మారింది. ఇప్పుడు జానకి పిల్లలు కూడా ఆమె బాటతోనే... మొక్కల పెంపకం, సంరక్షణ చేస్తున్నారు. 'నారీ శక్తి' అవార్డుతో సహా అనేక పురస్కారాలను అందుకున్న దేవకికి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 'పద్మశ్రీ' అవార్డు... పర్యావరణ పరిరక్షణ దిశగా ఎంతోమందికి స్ఫూర్తిని ఇస్తుందనడంలో సందేహం లేదు.

### జగమెరిగిన గురువు

**"క**ళారంగంలో మీరు ఏం సంపాదించారు?" అని ఒక సందర్భంలో ఎదురైన ప్రశ్నకు "వేలమంది శిష్యుల్ని. వారే నా సంపద" అని సగర్వంగా బదులిచ్చారు విమలా మీనన్.

# డాక్టర్ ఎన్.రాజంకు పద్మ విభూషణ్



**డా**క్టర్ ఎన్. రాజం ఉత్తర్‌ప్రదేశ్ నుంచి పద్మవిభూషణ్‌కు ఎంపికైనప్పటికీ ఆమె 1938 ఏప్రిల్ 8న చెన్నయ్‌లో జన్మించారు. వయొలిన్ విద్వాంసురాలిగా వాసికెక్కారు. హిందుస్థానీ శాస్త్రీయ సంగీతంలో పేరు పొందారు. మనుషుల స్వరాన్ని తలపించేలా వయొలిన్‌ను పలికించడం ద్వారా ఆమె 'సింగింగ్ వయొలినిస్ట్'గా ప్రఖ్యాతి గడించారు. బనారస్ హిందూ యూనివర్శిటీలో మ్యూజిక్ ప్రొఫెసర్‌గా సుదీర్ఘ కాలం పని చేశారు. 1984లో పద్మశ్రీ, 2004లో పద్మభూషణ్, 1990లో సంగీత నాటక అకాడమీ, 2012లో సంగీత నాటక అకాడమీ ఫెలోషిప్‌లు పొందారు. ఉత్తరప్రదేశ్ సంగీత నాటక అకాడమీ ఛైర్‌పర్సన్‌గానూ సేవలందించారు. ప్రఖ్యాత కర్నాటక సంగీతకారుడు విద్వాన్ ఎ.నారాయణ అయ్యర్ కుమార్తె అయిన ఆమె కర్ణాటక, హిందుస్థానీ సంగీతంలో ప్రావీణ్యం సంపాదించారు.



నృత్య కళాకారిణిగా, గురువుగా దాదాపు ఆరున్నర దశాబ్దాల అనుభవం ఆమెది. సంప్రదాయానికి ఎంతో ప్రాధాన్యతనిచ్చే మోహినీ ఆట్టం నృత్యాల్లో ఆహార్యం నుంచి ప్రదర్శన తీరు వరకూ ఆమె పలు ప్రయోగాలు చేశారు. కేరళలోని ఇరింజలకుడ గ్రామంలో 1943 జనవరి ఏడున ఆమె జన్మించారు.

సివిల్ ఇంజనీర్ అయిన తండ్రి కృష్ణన్‌నాయర్, తల్లి విశాలాక్షి ఆమె కళాభిరుచిని ప్రోత్సహించారు. చిన్న వయసులోనే నృత్యంతో పాటు కర్ణాటక సంగీతాన్ని కూడా ఆమె అభ్యసించారు. పాఠశాల విద్య పూర్తి చేసుకున్న తరువాత... 'కేరళ కళామండలం' సంస్థలో నృత్యంలో నాలుగేళ్ళ డిప్లమా చేశారు. 'కళామండలం విమలా మీనన్'గా ప్రసిద్ధులయ్యారు.

మోహినీ ఆట్టంతో పాటు కేరళలో ప్రత్యేకించి మహిళలు చేసే తిరువతిరుకళి, భరతనాట్యం, సుప్రసిద్ధ తెలుగు నృత్యగురువు వెంపటి చినసత్యం దగ్గర కూచిపూడి... ఇలా పలు నాట్యరీతులల్లో ఆమె ప్రావీణ్యం సంపాదించారు.

ఒక పాఠశాలలో డ్యాన్స్ టీచర్‌గా పని చేస్తూ ఉండగా... భూటాన్‌లో ప్రభుత్వాధికారి అయిన విశ్వనాథ మీనన్‌తో విమలకు వివాహమయింది. భర్తతో పాటు భూటాన్ వెళ్ళి, అక్కడ నృత్య పాఠాలు బోధించడంతో పాటు పలుప్రాంతాల్లో ప్రదర్శనలు ఇచ్చారు.

స్వదేశానికి వచ్చిన తరువాత తిరువనంతపురంలో 'కేరళ నాట్య అకాడమీ' అనే సంస్థను ప్రారంభించారు. వేలాదిమందిని మోహినీఆట్టం, భరతనాట్యం, కూచిపూడి నృత్యాల్లో నిష్ణాతులుగా తీర్చిదిద్దారు.

దక్షిణాది శాస్త్రీయ నృత్యాలకు చేసిన సేవలకు గుర్తింపుగా ఎన్నో గౌరవాలను అందుకున్న విమలకు తాజాగా కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారాన్ని ప్రకటించింది.

"నాలుగేళ్ళ వయసు నుంచి 'కేరళ కళామండలం'లో నృత్యం నేర్చుకోవాలని కలలుకన్నాను. అక్కడే పూర్తిస్థాయి నర్తకిగా, కొరియోగ్రాఫర్‌గా రూపుదిద్దుకున్నాను. ఎన్నో ప్రదర్శనలు ఇచ్చాను. కానీ నృత్యం నేర్పడంలో ఉన్న సంతృప్తి నాకు మరెక్కడా దొరకలేదు. అంటారు విమల.

(ఆంధ్రజ్యోతి సౌజన్యంతో)

■

నీవు ఎవరి మనసైనా నొప్పిస్తే వారి మన్నన కోరు, నిన్నెవరైనా నొప్పిస్తే వారిని మన్నించు

# పద్మ పురస్కారాలలో తెలుగు తేజాలు!

వైద్య రంగం నుంచి కళా రంగం వరకు విశిష్ట సేవలు అందించిన తెలుగువారిని ప్రతిష్ఠాత్మకమైన 'పద్మ' పురస్కారాలు వరించాయి. వైద్య రంగంలో విశేష సేవలు అందించిన డాక్టర్ జీవీ రావు, డాక్టర్ విజయ్ ఆనంద్‌రెడ్డి, విద్యా రంగంలో మామిడాల జగదీశ్‌కుమార్, విద్యావేత్త మామిడాల జగదీశ్‌కుమార్, క్షిపణి శాస్త్రవేత్త గద్దమణుగు చంద్రమౌళి, కూచిపూడి కళాకారిణి దీపికారెడ్డి, ప్రసిద్ధ సంస్కృత పండితుడు వెంపటి, అభినవ అన్నమయ్య గరిమెళ్ల, పాడి పరిశ్రమలో విప్లవం సృష్టించిన మామిడి రాంరెడ్డి తదితరులకు కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారాలను ప్రకటించింది.

**అభినవ అన్నమయ్య గరిమెళ్ల**

సంగీతానికే అంకితమై పుంభావ సరస్వతిగా పేరు తెచ్చుకున్న గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్‌ను పద్మశ్రీ అవార్డు వరించింది. ఆయన 1948 నవంబరు 9న రాజ



మహేంద్రవరంలో జన్మించారు. 600కు పైగా అన్నమయ్య కీర్తనలను స్వరపరిచి వెలుగులోకి తెచ్చిన ప్రసిద్ధ గాయకుడు ఆయన. టీటీడీ ఆస్థాన విద్వాంసుడిగా పని చేస్తూ భక్తిసంగీతానికి సేవలందించారు. సిలికానాంధ్ర సంస్థ సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్‌లో నిర్వహించిన లక్ష గళార్చన లో ప్రధాన గాయకులు. ఆ కార్యక్రమం గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్సులో చోటు దక్కించుకుంది. ప్రముఖ సినీ నేపథ్య గాయని ఎస్. జానకి సోదరి కుమారుడైన ఆయన సినిమా అవకాశాలు వచ్చినా శాస్త్రీయ సంగీతానికి, తిరుమల శ్రీవారి సేవకే అంకితమయ్యారు. గతేడాది మార్చి 9న కన్నుమూశారు.

**'మచ్చలేని' సర్జరీతో డాక్టర్ జీవీ రావు**

ప్రపంచంలోనే అత్యుత్తమ గ్యాస్ట్రో ఎంటరాలజీ వైద్యుల్లో ఒకరైన ఏఐజీ ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ జీవీ రావు(గుడూరు వెంకటరావు) పద్మశ్రీ పురస్కారానికి ఎంపికయ్యారు. ఏఐజీ ఆస్పత్రి సహ వ్యవస్థాపకుడైన ఆయన.. 12 వేలకుపైగా జీర్ణాశయ శస్త్రచికిత్సలు, 16 వేలకు పైగా ఎండోస్కోపీ చికిత్సలు నిర్వహించి రికార్డు సృష్టించారు.



పేషెంట్ల శరీరంపై ఎలాంటి మచ్చలూ పడకుండా, శస్త్ర చికిత్స బయటికి కనబడకుండా 'నో స్కార్ సర్జరీ'ని పరిచయం చేశారు. ఈ విధానంలో ప్రపంచంలోనే మొట్టమొదటి ట్రాన్స్‌రల్ ఎండోస్కోపిక్ అపెండెక్టమీ సర్జరీ చేశారు. భారత మొట్టమొదటి సర్జికల్ సిమ్యులేటర్‌ను అభివృద్ధి చేయడానికి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌తో కలిసి పని చేశారు.

మధుమేహం, ఫ్యాటీ లివర్, ఇన్‌ఫ్లమేటరీ బొవెల్ డిసీజ్ (ఐబీడీ) వంటి సమస్యలపై అవగాహన కల్పించేందుకు కృషి చేశారు. పాఠశాలలు, కమ్యూనిటీ కేంద్రాల్లో మొబైల్ ఎండోస్కోపీ, అల్ట్రాసౌండ్ పరీక్షలు, ఆరోగ్య శిబిరాలు నిర్వహించారు. టెలీమెడిసిన్ నెట్‌వర్క్ దూరప్రాంతాల్లోని గ్రామాలను ఏఐజీ ప్రత్యేక వైద్య కేంద్రాలతో అనుసంధానం చేసి, వైద్య సేవలను అందిస్తున్నారు. తన సేవలకు గుర్తింపుగా డాక్టర్ బీసీ రాయ్ జాతీయ అవార్డు, ది ఎకనామిక్ టైమ్స్ ఇన్‌స్పైరింగ్ డాక్టర్స్ ఆఫ్ ఇండియా అవార్డు, జేసీ అవుట్‌స్టాండింగ్ ఇంటర్నేషనల్ యంగ్ పర్సన్ అవార్డుతో పాటు పదుల సంఖ్యలో ప్రతిష్ఠాత్మక సంస్థల నుంచి గౌరవ ఫెలోషిప్‌లు పొందారు. పద్మశ్రీ అవార్డు సమాజంపై తన బాధ్యతను మరింత పెంచిందని డాక్టర్ జీవీ రావు ఈ సందర్భంగా చెప్పారు. తన వృత్తి జీవితమంతా మద్దతుగా నిలిచిన డాక్టర్ డి.నాగేశ్వరరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు చెబుతున్నానని పేర్కొన్నారు.

**భారత అంకాలజీకి మార్గదర్శకం.. విజయ్**

భారత్‌లో క్యాన్సర్ చికిత్సల రంగానికి మార్గదర్శకుడిగా నిలిచిన అపోలో క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ పాల్కొండ విజయ్ ఆనంద్‌రెడ్డిని పద్మశ్రీ వరించింది. వైద్య పరీక్షల నివేదికలు, రోగి శరీరతత్వం ఆధారంగా తన అనుభవాన్ని మిళితం చేసి.. ప్రతి క్యాన్సర్ రోగికి ప్రత్యేకంగా చికిత్స అందించడం ఆయన ప్రత్యేకత. 20వేల మందికి పైగా క్యాన్సర్

## డాక్టర్ నోరి దత్తాత్రేయుడుకు పద్మభూషణ్ !



దేశంలో నానాటికీ విశ్వరూపం దాలుస్తున్న క్యాన్సర్ మహమ్మారిపై యుద్ధభేరిని మోగించి.. దాన్ని ఎదుర్కోవడానికి తీసుకోవాల్సిన చర్యల గురించి రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలకూ మార్గనిర్దేశం చేస్తున్న ప్రపంచ ప్రఖ్యాత రేడియేషన్ ఆంకాలజిస్ట్.. డాక్టర్ నోరి దత్తాత్రేయుడుకు కేంద్ర ప్రభుత్వం పద్మభూషణ్ పురస్కారాన్ని ప్రకటించింది. ఆయనకు 2015లోనే పద్మశ్రీ పురస్కారం లభించింది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎందరో నేతలకు ఆత్మీయ వైద్యుడైన ఆయన.. కృష్ణా జిల్లా తోట్లవల్లూరు మండలం మంటాడ గ్రామంలో జన్మించారు. ప్రాథమిక విద్య స్థానికంగా పూర్తి చేసిన ఆయన.. మచిలీపట్నంలోని ఆంధ్రా జాతీయ కళాశాల(నేషనల్ కాలేజీ)లో పీయూసీ, కర్నూలు మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ చదివారు. ఆ తర్వాత ఉస్మానియా మెడికల్ కాలేజీలో ఎండీ పూర్తి చేశారు. ఐదు దశాబ్దాలుగా ప్రముఖ ఆంకాలజిస్ట్‌గా విశిష్ట సేవలు అందిస్తున్నారు.

ప్రస్తుతం అమెరికాలోని టాప్ 5 క్యాన్సర్ వైద్య నిపుణులలో ఆయన ఒకరు. 9 రకాల క్యాన్సర్‌లకు చికిత్సలు అందిస్తున్న వైద్యుడిగా ప్రసిద్ధి పొందారు. భారత్‌తో పాటు అనేక దేశాల్లో క్యాన్సర్ చికిత్సా కేంద్రాలను స్థాపించడానికి కృషి చేశారు. ప్రస్తుతం అమెరికాలో నివాసం ఉంటున్న ఆయన.. అప్పుడప్పుడూ తన స్వగ్రామాన్ని సందర్శిస్తుంటారు. దత్తాత్రేయుడు సతీమణి సుభద్ర కూడా డాక్టర్. వీరికి ఇద్దరు సంతానం. వైద్యరంగంలో 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయన 'మంటాడ టూ మ్యాన్‌హ్యాటన్' అనే పుస్తకాన్ని రచించారు. ఈ పుస్తకాన్ని నిరుడు మార్చిలో విజయవాడలో జరిగిన కార్యక్రమంలో సీఎం చంద్రబాబు ఆవిష్కరించారు.

రోగులకు చికిత్స చేశారు. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన విజయ్ ఆనంద్‌రెడ్డి ఉస్మానియా మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ చేశారు. తర్వాత అంకాలజీలో, రేడియేషన్ థెరపీలో ఎండీ చేశారు. ఆయన ఉమ్మడి ఏపీలో తొలి బోన్‌మారో ట్రాన్స్ ప్లాంట్, దేశంలో తొలిసారిగా ఇంట్రాకరోనరీ బ్రాకీ థెరపీ, రెటినో బ్లాస్టోమాకు తొలి ఇంట్రాఆర్టీరియల్ కీమోథెరపీ, కంటి



క్యాన్సర్‌కు తొలి ఇంట్రా–ఆక్యులర్ బ్రాకీథెరపీ, గ్లియోమా, పెనిస్ క్యాన్సర్ బాధితులకు ఇంటర్‌స్టీషియల్ ఇం ప్లాంట్ చికిత్సలు, ప్రొస్టేట్ క్యాన్సర్‌కు అల్ట్రాసౌండ్ గైడెడ్ ఇంప్లాంట్ చికిత్స నిర్వహించారు. ప్రొస్టేట్, రొమ్ము క్యాన్సర్ల చికిత్సలో తక్కువ వ్యవధితో రేడియేషన్ వినియోగించే విధానాలను అభివృద్ధి చేశారు. 2003లో క్యూర్ ఫౌండేషన్ స్థాపించి.. పేద క్యాన్సర్ రోగులకు ఉచితంగా/తక్కువ ఖర్చుతో పరీక్షలు, చికిత్సలు అందిస్తున్నారు. 108 మంది క్యాన్సర్ విజేతల నిజ జీవిత కథలతో 'ఐయామ్ సర్వైవర్' పుస్తకం రాశారు. పద్మశ్రీ అవార్డు రావడం గర్వంగా ఉందని, ఇది తన సేవలకు దక్కిన ఫలితంగా భావిస్తానని విజయ్ ఆనంద్‌రెడ్డి చెప్పారు.

### విద్యావేత్తకు విశిష్ట పురస్కారం

నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలం మామిడాల గ్రామానికి చెందిన విద్యావేత్త మామిడాల జగదీశ్‌కుమార్‌ను పద్మశ్రీ వరించింది. మిర్యాలగూడలో డిగ్రీ, హైదరాబాద్‌లో పీజీ చేసిన ఆయన.. మద్రాస్ ఐఐటీలో ఎంఎస్, పీహెచ్‌డీ పూర్తి చేశారు. 1991 నుంచి 1994 వరకు కెనడాలోని వాటర్‌లూ యూనివర్సిటీలో పోస్ట్ డాక్టోరియల్ పరిశోధన



చేశారు. ఢిల్లీ ఐఐటీలోని ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగంలో ప్రొఫెసర్‌గా పని చేశారు. నానో ఎలక్ట్రానిక్స్ విభాగంలో పరిశోధనల కోసం కృషి చేశారు. 2016 జూన్ 24 నుంచి 2019

**నీ కంటె ఎంత గొప్పవారితో వున్నావని కాదు, వారు నీకు అండగా నిలిచే వారా కాదా అన్నదే ముఖ్యం**

జూన్ 23 వరకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) ఇన్‌చార్జి చైర్మన్‌గా, 2022 ఫిబ్రవరి 4 నుంచి 2025 ఏప్రిల్ 7వరకు చైర్మన్‌గా పని చేశారు. ఈ సమయంలో దేశ వ్యాప్తంగా యూనివర్సిటీలు, కాలేజీలలో విద్యా ప్రమాణాల పెంపు కోసం కృషి చేశారు.

**పాడికి ప్రోత్సాహం... పద్మశ్రీ పురస్కారం**

పశుపోషణ, డెయిరీ రంగాల్లో విశేష సేవలందించిన మామిడి రామారెడ్డికి మరణానంతరం పద్మశ్రీ పురస్కారం దక్కింది. రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌కు చెందిన మామిడి రామారెడ్డి సీడీఎఫ్ (కో– ఆపరేటివ్ డెవలప్‌మెంట్ ఫౌండేషన్) ఏర్పాటు చేశారు. హన్మకొండ జిల్లా ముల్కనూరులో మహిళా డెయిరీని కూడా ప్రారంభించారు. పశుపోషణ, పాడినిర్వహణ,



పొదుపు అంశాల్లో లక్షలాది మంది రైతులకు శిక్షణ ఇచ్చారు. ప్రభుత్వ జోక్యం లేకుండా ప్రాథమిక సహకార సంఘాలు నడిచేలా పోరాడారు. గత ఏడాది అక్టోబరులో ఆయన కన్నుమూశారు.

**ఆకాశ్ శాస్త్రవేత్తకు.. ఆకాశమంత గౌరవం**

రక్షణ రంగంలో కీలకమైన క్షిపణి శాస్త్రవేత్త గద్దమణుగు చంద్రమౌళికి పద్మశ్రీ పురస్కారం దక్కింది. ఖమ్మం జిల్లా మధిర పట్టణానికి చెందిన ఆయన.. వరంగల్ ఆర్ఈసీలో మెకానికల్ ఇంజనీరింగ్, ఢిల్లీ ఐఐటీలో ఎంటెక్ చదివారు. ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందారు. దాదాపు 34 ఏళ్లపాటు డీఆర్‌డీఓలో శాస్త్రవేత్తగా పనిచేసి



2018లో రిటైరయ్యారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. డీఆర్‌డీఓ శాస్త్రవేత్తగా చంద్రమౌళి ఆకాశ్ క్షిపణి అభివృద్ధిలో మాజీ రాష్ట్రపతి, క్షిపణి శాస్త్రవేత్త అబ్దుల్ కలాంతో కలిసి పనిచేశారు. ఆకాశ్ క్షిపణి ప్రాజెక్టు డైరెక్టర్‌గా కూడా వ్యవహరించారు. ఆయన 2005లో డీఆర్‌డీవో అగ్ని అవార్డు పొందారు. 2007లో మోక్షగుండం విశ్వేశరయ్య అవార్డు, 2013లో డీఆర్‌డీవో సైంటిస్ట్ ఆఫ్ ది ఇయర్ అవార్డు, 2014లో ఫిక్కీ నుంచి గ్లోబల్ లీడర్ అవార్డును పొందారు. ప్రస్తుతం ఆయన హైదరాబాద్‌లో స్థిరపడ్డారు.

**కూచిపూడి నాట్యానికి పద్మం**

ప్రముఖ కూచిపూడి నర్తకీమణి, తెలంగాణ సంగీత నాటక అకాడమీ పూర్వ చైర్‌పర్సన్ దీపికారెడ్డిని పద్మశ్రీ పురస్కారం వరించింది. హైదరాబాద్‌లో పుట్టి పెరిగిన ఆమె.. ప్రఖ్యాత నాట్యాచార్యులు వెంపటి చినసత్యం దగ్గర శిక్షణ పొందారు. తన 11వ ఏటనే



అరంగేట్రం చేశారు. జాతీయ, అంతర్జాతీయ వేదికలపై వెయ్యికి పైగా నృత్య ప్రదర్శనలు ఇచ్చారు. దీపాంజలి నాట్య శిక్షణాలయాన్ని స్థాపించారు. పర్యావరణ పరిరక్షణ, సామాజిక ప్రగతి, సమానత్వం, తెలుగు భాష ఔన్నత్యం వంటి సామాజిక అంశాలపైనా నృత్యరూపకాల ద్వారా అవగాహనా కార్యక్రమాలు చేపట్టారు. అయోధ్య రామాలయ ప్రాంగణం లోనూ నృత్య ప్రదర్శన ఇచ్చారు. ఉత్తమ కళాకారిణి పురస్కారం, కేంద్ర సంగీత, నాటక అకాడమీ అవార్డు తదితర పురస్కారాలు పొందారు. పద్మశ్రీకి ఎంపికయిన ఆనందం మాటల్లో వర్ణించలేనిదని దీపికారెడ్డి పేర్కొన్నారు.

**ప్రసిద్ధ సంస్కృత పండితుడు వెంపటి**

దేశంలోని మూడు ప్రసిద్ధ సంస్కృత వర్సిటీలకు ప్రసిద్ధ సంస్కృత పండితుడు వెంపటి కుటుంబ శాస్త్రి ఉపకులపతిగా పని చేశారు. ప్రస్తుతం తిరుపతిలో నివాసం ఉంటున్నారు. 1950 ఆగస్టు 12న కృష్ణాజిల్లా గుడ్లవల్లేరులో వెంపటి



జగన్నాథం, రాజ్యలక్ష్మి దంపతులకు జన్మించిన వెంపటి కుటుంబశాస్త్రికి అద్వైత వేదాంతం, దర్శనాలు, కావ్య శాస్త్రం, సంస్కృత సాహిత్యంలో సుప్రసిద్ధ సంస్కృత పండితుడిగా పేరుంది. ఆయన 2014లో రాష్ట్రపతి పురస్కారం అందుకున్నారు. "ఊపిరి ఉన్నంతవరకు సంస్కృతాభివృద్ధికే నా సేవలందిస్తాను" అని పద్మశ్రీకి ఎంపికైన తర్వాత వెంపటి ఆంధ్రజ్యోతితో అన్నారు.

– ఆంధ్రజ్యోతి సౌజన్యంతో

■

# గ్రామ స్థాయిలో చిరుధాన్యాల ప్రాసెసింగ్!

## అనంతపురం మిల్లెట్ మేళ సమావేశంలో వక్తల అభిలాష




చిరుధాన్యాల ప్రాసెసింగ్‌ను గ్రామ స్థాయికి వికేంద్రీకరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, తద్వారా రైతులు, వినియోగదారులు కూడా ప్రయోజనం పొందుతారని స్వచ్ఛ ఖాద్యం వ్యవస్థాపకుడు సతీష్‌కుమార్ సీఏ, ధరణి సీఈఓ రమేష్‌కుమార్ అభిప్రాయపడ్డారు.

అనంతపురంలో మూడు రోజుల పాటు జరిగిన మిల్లెట్ మేళా 2026 ముగింపు సభ శనివారం జరిగింది. సభలో అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాలకు చెందిన పలు రైతు ఉత్పత్తిదారుల సంఘాల (ఎఫ్‌పిఓ) డైరెక్టర్ల బోర్డు సభ్యులతో యాక్సియన్ ఫ్రాటర్నా ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ వై.వి. మల్లారెడ్డి మాట్లాడుతూ ఎక్కడైతే డైరెక్టర్ల బోర్డు చురుకుగా ఉండి వాటాదారులు తమ ఉత్పత్తులను ఎఫ్‌పిఓకు విక్రయించడం లేదా దాని నుండి ముడిసరుకులను కొనుగోలు చేయడం లాంటి చర్యలు చేస్తున్నారో, అక్కడ వారు విజయవంతంగా లాభాలతో నడుస్తున్నారని అన్నారు.

టింబాక్టు కలెక్టివ్ సహవ్యవస్థాపకురాలు మేరీ పట్టమట్టం మాట్లాడుతూ, అన్ని కాయ కూరలు, వంటలలో జరుగుతున్న కల్తీని హైలైట్ చేస్తూ, ప్రజారోగ్యాన్ని మెరుగుపరచడానికి వ్యవసాయంలో సహజ సేంద్రియ వ్యవసాయాన్ని చేపట్టడం ద్వారా దీనిని అరికట్టాలని అభిప్రాయపడ్డారు.

మాజీ ఐఏఎస్ అధికారి స్మరజిత్ రే భార్య నందితా రే మాట్లాడుతూ వ్యవసాయ పర్యావరణ నమూనాలకు కట్టుబడి, ఉద్యానవన పంటలను వార్షిక చిరుధాన్యాల పంటలతో కలిపి, సేంద్రియ వ్యవసాయం, ఉమ్మడి పచ్చిక బయళ్ల ద్వారా టింబాక్టు కలెక్టివ్ అభివృద్ధి చేస్తున్న 100 ఎకరాల ఉమ్మడి భూములను సందర్శించవలసిందిగా రైతులకు ఆహ్వానం పలికారు. సభలో ఏపీఎంఏఎస్ వ్యవస్థాపకుడు సి.ఎస్. రెడ్డి తదితరులు ఉన్నారు. మిల్లెట్ మేళాలో పాల్గొన్న స్వచ్ఛంద సంస్థలు, సుమారు 30 స్టాళ్లను ఏర్పాటు చేశాయి. రైతులతో సహా వివిధ వర్గాల ప్రజలు దాదాపు 1,500 మందికి పైగా ఈ స్టాళ్లను సందర్శించారు. ఇండియా పోస్ట్ ఒక స్టాల్‌ను ఏర్పాటు చేసి ఎఫ్‌పిఓలు తమ చిరుధాన్యాలను తక్కువ ఖర్చుతో ఎలా ఎగుమతి చేయవచ్చో వివరించింది. పలు వ్యవసాయ, ఉద్యాన, డిప్లొమా కళాశాలలు, ఆర్ట్స్ కళాశాలల విద్యార్థులు మిల్లెట్ మేళలో స్టాళ్ళను సందర్శించి మూడు రోజుల పాటు జరిగిన ఉపన్యాసాలను వినడం గమనించదగ్గ విషయం. ■

# వెయ్యి గింజల వరి కంకి-ఎకరానికి పది టన్నుల దిగుబడి!

**ఆ**రుగాలం ఎంతో శ్రమపడి పండించిన పంట చివరికి చేతికొచ్చేసరికి తగిన దిగుబడి రాకపోవడంతో తీవ్ర నిరాశ చెందుతున్న రైతులెందరో. కానీ ఇకపై అలాంటి అవసరం ఉండకపోవచ్చు. మీ కోసమే భారత వరి పరిశోధన సంస్థ శాస్త్రవేత్తలు కొత్త తరహా వంగడాన్ని అభివృద్ధి చేస్తున్నారు. దీని ప్రత్యేకత ఏంటంటే చీడపీడలను తట్టుకుని వరి దిగుబడిని పెంచడమే. అసలేంటి ఆ కొత్త రకం విత్తనం? మరి వాటి ప్రత్యేకతలేంటో ఇప్పుడు తెలుసుకుందామా?

**సరికొత్త వంగడం అభివృద్ధి :**

ఒక ఎకరం భూమిలో సాధారణ రకం వరి విత్తనాలు వేస్తే ఇటీవల కాలంలో కంకికి 150-200 వద్ద గింజలు దిగుబడి వస్తుంది. మొత్తం సుమారుగా 2 నుంచి 2.5 టన్నుల వరి దిగుబడి వస్తోంది. గత సంవత్సరం అక్టోబరు నెలలో విడుదలైన డీఆర్ఆర్ ధాన్ 75, 76 రకాల్లో వరి కంకికి 450-500 గింజలు వస్తున్నాయి.

వీటి ద్వారా 3.5 నుంచి 4.5 టన్నుల మేరకు దిగుబడి వస్తోంది. భారత వరి పరిశోధన సంస్థ (ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రైస్ రీసెర్చ్)లో దీనికి రెట్టింపు స్థాయిలో వరి కంకికి వెయ్యి గింజలతో ఎకరానికి 10 టన్నుల మేరకు భారీ ఉత్పత్తి సాధించే దిశగా ఈ కొత్త వంగడం సిద్ధమవుతోంది.

వీటిపై ప్రాథమిక ప్రయోగాలు పూర్తయ్యాయి. తుది ఫలితాల అనంతరం మరో రెండు సంవత్సరాల్లో ఈ రకం వంగడాలు అందుబాటులోకి తీసుకురానుంది. హైబ్రిడ్‌లో కాకుండా సంప్రదాయ రకాల కలయిక ద్వారా ఈ సంస్థ సైంటిస్టు కొత్త రకాన్ని సృష్టిస్తున్నారు. తక్కువ కాలవ్యవధిలో సాగయ్యే సన్న రకంగా తెగుళ్లను తట్టుకునే విధంగా ఉండటం వీటి ప్రత్యేకత. గ్లూకోజ్ శాతం తక్కువ ఉండే విధంగా దీన్ని రూపొందిస్తున్నారు.

"కంకికి వెయ్యి గింజలతో ఎకరం విస్తీర్ణం గల భూమిలో పది టన్నులు పండే వరి వంగడం 2027 డిసెంబరు నాటికి అందుబాటులోకి తేవాలని సంకల్పించాం. దీనికనుగుణంగా పరిశోధనలు జరుగుతున్నాయి. కొత్త వంగడం వరిలో హిస్టరీ క్రియేట్ చేస్తుంది. ప్రస్తుతం చైనా దేశంలో హైబ్రిడ్ వరి ఎకరానికి 6 టన్నులు వస్తోంది. మేం రూపొందిస్తున్న వరి వంగడం దాన్ని అధిగమిస్తుంది. రైతులకు ఉత్పాదకతను, దేశానికి ఆహారభద్రతను కూడా రెట్టింపు చేస్తుంది. కొత్తరకం విత్తనోత్పత్తికీ అనుకూలం"

**– ఐఐఆర్ఆర్ శాస్త్రవేత్తలు**

■

## ఏడాదిలో 5 రాగి పంటలు !

**ఇ**క్రిశాట్ (అంతర్జాతీయ మెట్ట ప్రాంతాల పంటల పరిశోధన సంస్థ) రాగులపై విస్తృత పరిశోధనలు చేసి, 'ర్యాపిడ్ రాగి' అనే పేరుతో ఓ కొత్త వంగడాన్ని అభివృద్ధి చేసింది.

మన దేశంలో జొన్న, సజ్జల తర్వాత 3 అత్యంత ముఖ్యమైనటువంటి చిరుధాన్యంగా రాగి పంట గుర్తింపు పొందింది. ఏపీలో లక్ష ఎకరాల్లో, తెలంగాణలో 13,000 ఎకరాల్లో సాగవుతోంది. ప్రస్తుతం అందుబాటులో ఉన్నటువంటి వంగడాలతో పంట కాలం 135 రోజులుగా ఉండటంతో ఏడాదికి రెండు పంటలు మాత్రమే సాధ్యమవుతున్నాయి.

- ఇక్రిశాట్ కొత్త వంగడం 'ర్యాపిడ్ రాగి' పంట 68 రోజుల్లోనే చేతికొస్తుంది.
- దీంతో ఏడాదిలో 5 పంటలను పండించవచ్చు.
- విత్తనం వేసిన తర్వాత సత్వరమే అది మొలకెత్తుతుంది.
- తక్కువ పూతతో మొక్క మరింత వేగంగా ఎదుగుతుంది.
- ఎక్కువ కాంతి, ఉష్ణోగ్రత, తేమ నుంచి తట్టుకోవడంతో పాటు తక్కువ నీటితో సాగవుతుంది.

■

# అనంతలో జల సంరక్షణకు ప్రధాని ప్రశంస!

ప్రజల భాగస్వామ్యంతోనే జలవనరుల పునరుద్ధరణ సాధ్యమని ప్రధాని మోదీ తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురంలో ప్రజలు, అధికారులు కలిసి చేపట్టిన జలసంరక్షణ చర్యలను ఆదివారం తన 'మన్‌కీ బాత్' ప్రసంగం సందర్భంగా ప్రశంసించారు. అనంతపురం జిల్లాలో జరిగిన నీటి సంరక్షణ పనులను ప్రధాని ప్రత్యేకంగా ప్రస్తావించారు. "తీవ్ర కరువుతో, ఎర్ర నేలలతో ఎడారిని తలపించే అనంతపురంలో నీటి ఎద్దడి ప్రధాన సమస్యగా ఉండేది. అక్కడ ఎక్కువ ప్రాంతాల్లో వర్షాలు పడవు. అందుకే.. అక్కడి ప్రజలు అనంతపురాన్ని ఎడారితో పోలుస్తారు. ఈ తీవ్రమైన పరిస్థితుల్లో స్థానిక ప్రజలు, యంత్రాంగం కలిసి నీటి వనరుల అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. ప్రస్తుతం అవి నీటితో కళకళలాడుతున్నాయి. దీనితోపాటు 7 వేలకు పైగా మొక్కలు నాటారు. తద్వారా అనంతపురంలో నీటి సంరక్షణతో పాటు పచ్చదనం కూడా పెరిగింది. ఒక విధంగా చెప్పాలంటే అక్కడి మొత్తం పర్యావరణ వ్యవస్థ పునరుద్ధరించబడింది. అక్కడి ప్రజలు, పాలకులు చేసిన ఈ సామూహిక కృషి ఎంతో గర్వకారణం" అని మోదీ కొనియాడారు. అలాగే యూపీలోని ఆజంగఢ్ ప్రజలు తమ ప్రాంతంలో ప్రవహించే తంసా నదిని పునరుద్ధరించిన తీరును అభినందించారు. కాలుష్యం, పూడిక, చెత్తాచెదారంతో నిండిన ఆ నదిని ఓ ఉద్యమంలా శుభ్రం చేశారన్నారు. దేశ ప్రజల్లో ఉన్న సృజనాత్మకత, సమస్యలను పరిష్కరించుకునే తత్వం అద్భుతమని పేర్కొన్నారు.

**మోదీకి సీఎం చంద్రబాబు ధన్యవాదాలు**

అనంతపురం జిల్లాలో జలసంరక్షణ చర్యల గురించి ప్రధాని మోదీ తన మన్‌కీ బాత్ కార్యక్రమంలో ప్రస్తావించడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించారు. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్టు చేశారు. నీటి సంరక్షణలో అనంతపురం ప్రజలు చేసిన స్ఫూర్తిదాయకమైన ప్రయత్నాలను హైలెట్ చేసినందుకు మోదీకి సీఎం ధన్యవాదాలు తెలిపారు. స్వర్ణాంధ్ర విజన్ కింద నిర్దేశించుకున్న పది సూత్రాల్లో నీటి భద్రత అత్యంత ముఖ్యమని పేర్కొన్న సీఎం... సాంప్రదాయ నీటి నిర్వహణకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అనుసంధానించి నీటి వనరులను సంరక్షిస్తున్నామని పేర్కొన్నారు. ప్రధాని మోదీ సందేశం నీటి భద్రతా మిషన్‌కు మరింత ప్రోత్సాహాన్ని కలిగిస్తుందని చంద్రబాబు పేర్కొన్నారు. ■

## అవయవ దానంతో ఆరుగురి జీవితాల్లో వెలుగులు

రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఇంజనీరింగ్ విద్యార్థి బ్రెయిన్ డెడ్ అయినా.. ఆరుగురి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాడు. గుంటూరు జిల్లా తెనాలి మండలం పినపాడుకు చెందిన ఇంజనీరింగ్ విద్యార్థి పెరుగు అమర్ బాబు (22) తాడికొండ మండలం నిడుముక్కలలో 2026 జనవరి24న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం ఆయనను గుంటూరులోని ఆస్టర్ రమేశ్ హాస్పిటల్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అమర్‌బాబు బ్రెయిన్ డెడ్ అయినట్టు వైద్యులు ప్రకటించారు. ఈ నేపథ్యంలో జీవన్‌దాన్ కో ఆర్డినేటర్లు బాధిత కుటుంబ సభ్యులను కలిసి వారికి అవయవదానం ప్రాముఖ్యతను వివరించారు. దీంతో వారు అవయవ దానానికి అంగీకరించారు. అమర్ గుండెను తిరుపతికి తరలించాలని డాక్టర్లు నిర్ణయించారు. పోలీస్ శాఖకు సమాచారం ఇవ్వడంతో వారు గ్రీన్‌ఛానల్ ద్వారా ట్రాఫిక్‌ను నియంత్రించి, ప్రత్యేక అంబులెన్స్‌లో అమర్ గుండెను గన్నవరం ఎయిర్‌పోర్టుకు, అక్కడి నుంచి విమానంలో తిరుపతికి పంపించారు. అమర్ కాలేయం, రెండు కిడ్నీలను గుంటూరు రమేశ్ హాస్పటల్‌కు కేటాయించగా, అక్కడ ముగ్గురు రోగులకు వాటిని అమర్చారు. రెండు కార్నియాలను ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ కు పంపించారు. ■

**నిజమైన ఆనందానికి చిరునామా నీ తోడ్పాటుతో సంతోషంగా జీవించేవారి కళ్లలో చిందే చిరునవ్వు**

# 'ఒక ఎకరం - ఒక సీజన్'.. మోడీ సహజ వ్యవసాయ మంత్రం!

సహజ వ్యవసాయంపై ప్రధాని నరేంద్రమోడీ తన అభిప్రాయాలను పంచుకున్నారు. లింక్డ్ ఇన్ పోస్టులో సహజ వ్యవసాయం గొప్పతనాన్ని ఆయన వివరించారు. సహజ వ్యవసాయం అనేది ఆధునిక పర్యావరణ శాస్త్రాలను సమన్వయం చేసుకుని, ఎలాంటి ఎరువులు, పురుగుల మందులు లేకుండా పంటలను పండించే ఒక విధానం. ఇందులో ఒకే క్షేత్రంలో పంటలు, చెట్లు, పశువులు కలిసి జీవ వైవిధ్యాన్ని పెంచుతాయి. బయట నుంచి ఎరువులు, మందుల వంటివి వాడకుండా, ఆ వ్యవసాయ క్షేత్రంలో లభించే పేడ, పచ్చిరొట్ట వంటి వాటితో, మల్చింగ్ వంటి వాటితో నేల సారాన్ని పెంచడం ముఖ్య లక్షణం.

గత ఏడాది కేంద్ర ప్రభుత్వం "జాతీయ సహజ వ్యవసాయ మిషన్"ను ప్రారంభించిందని, దీని ద్వారా లక్షలాది మంది రైతులు సహజ పద్ధతులకు మారుతున్నారని, దేశవ్యాప్తంగా వేల హెక్టార్లలో సహజ వ్యవసాయం జరుగుతోందని ప్రధాని వెల్లడించారు. ఎగుమతుల ప్రోత్సాహం, క్రెడిట్ కార్డ్ ద్వారా సౌకర్యవంతమైన రుణాలు, పీఎం కిసాన్ పథకాల వల్ల సహజ వ్యవసాయం మరింత వేగంగా విస్తరిస్తోందని ఆయన అన్నారు. ముఖ్యంగా మహిళా రైతులు అధికంగా ఈ పద్ధతికి ఆకర్షితులు అవ్వడం ఆనందాన్ని ఇస్తుందని చెప్పారు.

గత కొన్నేళ్లుగా రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగం నేల సారాన్ని, తేమను తగ్గించిందని, ఉత్పత్తి ఖర్చులు బాగా పెరిగాయని ప్రధాని అన్నారు. వీటన్నింటికి సహజ వ్యవసాయం పరిష్కరిస్తుందని చెప్పారు. ఒక ఎకరం– ఒక సీజన్‌లో ఈ పద్ధతి ద్వారా వ్యవసాయం చేయాలని తాను రైతులను ప్రోత్సహిస్తున్నానని, చిన్న స్థాయిలో వచ్చిన ఫలితాలు వారికి నమ్మకాన్ని ఇస్తాయని అన్నారు. కోయంబత్తూర్ లో రైతులు, శాస్త్రవేత్తలు, స్టార్టప్స్ ఇలా అందరూ ఒకే చోటుకు రావడం తనకు చాలా ఆనందాన్ని ఇచ్చినట్లు మోడీ అన్నారు. భవిష్యత్తులో వ్యవసాయం రంగాన్ని ఉత్పాదకంగా, పర్యావరణ అనుకూలంగా మార్చుతామని నమ్ముతున్నట్లు చెప్పారు.

ఒక రైతు 10 ఎకరాల్లో బహుళ స్థాయి సాగు చేస్తూ, అరటి, కొబ్బరి, బొప్పాయి, మిరియాలు, పసుపు వంటి పంటలను పెంచుతున్నారని, 60 దేశీ ఆవులు, 400 మేకలు ఉన్నట్లు ప్రధాని చెప్పారు. మప్పిళ్లై సంబా అనే మరో రైతు "కరుప్పు కావుని" వంటి స్వదేశీ బియ్యం రకాలకు తన జీవితాన్ని అంకితం చేశారని పోస్టులో వెల్లడించారు.

ఫస్ట్ జనరేషన్‌కు చెందిన ఒక గ్రాడ్యుయేట్ 15 ఎకరాల్లో సహజ వ్యవసాయం చేస్తూ, 3000 మందికి పైగా రైతులకు శిక్షణ ఇచ్చారని, ప్రతీ నెల దాదాపుగా 30 టన్నుల కూరగాయలను సరఫరా చేస్తున్నారని వెల్లడించారు. కొన్ని రైతు ఉత్పత్తిదారుల సంస్థలు(ఎఫ్‌పీఓలు) కసావా రైతులను ప్రోత్సహిస్తూ, బయో ఇథనాల్, క్రంప్రెస్డ్ బయోగ్యాస్ తయారీలో కసావా ముడి ఉత్పత్తుల్ని వాడేలా ప్రచారం చేస్తున్నారని అన్నారు. బయో టెక్నాలజీలో నిపుణుడైన మరో వ్యక్తి సముద్ర శైవలాల ఆధారంగా బయో ఫర్టిలైజర్ తయారు చేసే సంస్థను ప్రారంభించి, తీర ప్రాంతాల్లో 600 మంది మత్స్యకారులకు ఉపాధి కల్పిస్తున్నారని చెప్పారు. ■

## వంద శాతం రాయితీపై ఆయిల్‌పామ్ మొక్కలు

ఉద్యానవన శాఖ ద్వారా ఆయిల్‌పామ్ సాగు చేపట్టే రైతులకు వంద శాతం రాయితీపై హెక్టారుకు రూ. 29 వేలు విలువైన 143 మొక్కలను రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందిస్తోంది. ఆయిల్‌పామ్‌లో అంతర పంటలకు హెక్టారుకు ఏడాదికి రూ. 5,250 చొప్పున నాలుగేళ్లలో రూ. 21 వేలు రాయితీ లభిస్తుంది. చాప్ కట్టర్, వర్మీ కంపోస్టు యూనిట్లు, వైర్ మెష్‌పై 50 శాతం, డ్రిప్ ఇరిగేషన్‌కు 50 శాతం రాయితీ ఇస్తున్నారు. ■

# 'నెలసరి' ఆరోగ్యం మహిళల ప్రాథమిక హక్కు!

**రా**జ్యాంగం ప్రసాదించిన జీవించే హక్కు, విద్యా హక్కులో భాగంగా.. నెలసరి సమయంలో ఆరోగ్యంగా ఉండడం (రుతుక్రమ ఆరోగ్యం) మహిళల ప్రాథమిక హక్కు అని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఆరు నుంచి 12వ తరగతి వరకూ చదివే కౌమార దశలోని బాలికల కోసం కేంద్రం రూపొందించిన 'పాఠశాలలకు వెళ్లే బాలికల కోసం రుతుక్రమ పారిశుధ్య విధానాన్ని దేశవ్యాప్తంగా అమలు చేయాలని జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం సూచించింది.

అందులో భాగంగా.. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లలో మగ పిల్లలకు, ఆడ పిల్లలకు వేరువేరుగా శౌచాలయాలను ఏర్పాటు చేయాలని, వాటిలో ఉపయోగించడానికి వీలయ్యే నీటి కనెక్షన్ ఉండేలా చూడాలని, విద్యార్థినులకు పర్యావరణ హిత శానిటరీ న్యాప్‌కిన్స్‌ను ఉచితంగా అందుబాటులో ఉంచాలని దేశంలోని అన్ని రాష్ట్రాల, కేంద్రపాలిత ప్రాంతాల ప్రభుత్వాలను ఆదేశించింది.

ఈ తీర్పును అమలు చేయకపోతే ప్రైవేటు స్కూళ్ల గుర్తింపును రద్దు చేయాలని.. ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేయకపోతే అందుకు నేరుగా రాష్ట్ర ప్రభుత్వాలను బాధ్యులను చేస్తామని హెచ్చరించింది. పాఠశాలల్లో విద్యార్థినులకు ఉచితంగా శానిటరీ న్యాప్‌కిన్లు అందించాలని, కనీస పారిశుధ్య సౌకర్యాలు ఏర్పాటయ్యేలా చూడాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై విచారణ జరిపిన సుప్రీంకోర్టు.. ఈ తీర్పును వెలువరించింది.

"ఒక పీరియడ్ (ఫుల్‌స్టాప్) వాక్యాన్ని ముగించాలి తప్ప.. బాలికల విద్యను కాదు" అన్న అమెరికన్ విద్యావేత్త, సామాజిక కార్యకర్త మెలిస్సా బెర్టన్ హృద్యమైన వ్యాఖ్యను ఉటంకిస్తూ జస్టిస్ జేబీ పార్దీవాలా 126 పేజీల తీర్పును ప్రారంభించారు.

"రాజ్యాంగంలోని 21వ అధికరణం కింద కల్పించిన జీవించే హక్కులో రుతుక్రమ ఆరోగ్యం కూడా ఒక భాగమే. ఒక బాలిక అత్యున్నతమైన లైంగిక, పునరుత్పత్తి ఆరోగ్యాన్ని సాధించడానికి.. సురక్షితమైన, ప్రభావవంతమైన, అందుబాటు ధరల్లో ఉండే నెలసరి ఆరోగ్య నిర్వహణ చర్యలు ఉపయోగపడతాయి. ఆరోగ్యకరమైన పునరుత్పత్తి జీవితాన్ని గడిపే హక్కులో భాగంగా.. లైంగిక ఆరోగ్యాన్ని గురించి తెలుసుకునే హక్కు, దానికి సంబంధించిన చదువును పొందే హక్కు కూడా ఉంటుంది" అని ఆయన తన తీర్పులో పేర్కొన్నారు.

కాగా.. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21ఏ ప్రకారం లభించే 'విద్యాహక్కు'ను సుప్రీంకోర్టు 'మల్టీప్లయర్ రైట్'గా (అంటే.. ఒక వ్యక్తి బాగా చదువుకుంటే, తద్వారా తనకున్న మిగతా అన్ని హక్కుల గురించీ తెలుసుకుంటారని అర్థం) అభివర్ణించింది. మనిషి గౌరవంగా బతకాలన్నా, జీవించే హక్కును పూర్తిస్థాయిలో అనుభవించాలన్నా అది చదువు ద్వారానే సాధ్యమని తేల్చి చెప్పింది.

అంతటి కీలకమైన చదువులకు.. రుతుక్రమంపై సరైన అవగాహన లేకపోవడం వల్ల, పాఠశాలల్లో సౌకర్యాలు లేకపోవడం వల్ల చాలామంది బాలికలు దూరం కావాల్సిన పరిస్థితి వస్తోందని.. చదువు ఆగిపోవడం వల్ల వారు తమ ఇతర హక్కులను కూడా వినియోగించుకోలేకపోతున్నారని ఆవేదన వెలిబుచ్చింది.

ప్రాథమిక విద్యా హక్కు, విద్యాహక్కు చట్టం అనేవి.. ఉచిత, నిర్బంధ విద్యను అందిస్తాయని, అటువంటి విద్యను పొందడానికి అడ్డంకిగా మారే ఖర్చులు, రుసుములు ఏవైనా సరే ఈ హక్కుకిందకే వస్తాయని తేల్చిచెప్పింది(అంటే శానిటరీ ప్యాడ్లకు అయ్యే ఖర్చువల్ల విద్యార్థినులు చదువు మానేయాల్సిన పరిస్థితి వస్తే ఆ ఖర్చును ప్రభుత్వమే భరించాలని దీని అర్థం).

**కీలక ఆదేశాలు..**

పాఠశాలల్లో రుతుక్రమ ఆరోగ్య నిర్వహణ చర్యలు లేకపోవడం వల్ల బాలికల విద్య ఆగిపోకుండా పలు కీలక ఆదేశాలను ధర్మాసనం జారీ చేసింది. గ్రామీణ, పట్టణ

ఏమి అన్నావనేదానికంటె ఎలా అన్నావనేది ముఖ్యం, మనసును ఒప్పించినా నొప్పించినా అది మాటతీరే !

ప్రాంతాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలన్నింటిలోనూ 'ఏఎస్‌టీఎండీ–6954' ప్రమాణాలకు తగినట్టుగా తయారు చేసిన పర్యావరణహిత శానిటరీ న్యాప్కిన్లను విద్యార్థినులకు ఉచితంగా అందుబాటులో ఉంచాలని అన్ని రాష్ట్రాల, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రభుత్వాలనూ ఆదేశించింది. వాటిని కూడా.. మరుగుదొడ్ల ప్రాంగణంలోనే, వెండింగ్ మెషీన్ల ద్వారా అందుబాటులో ఉంచాలని, అలాంటి అవకాశం లేని చోట.. ఒక నిర్ణీత ప్రదేశంలో నిర్ణీత అధికారి(టీచర్/ప్రిన్సిపాల్) వద్ద లభ్యమయ్యేలా చూడాలని పేర్కొంది. ఇంకా.. ప్రతి పాఠశాలలోనూ పని చేసే స్థితిలో ఉన్న, ఆడ–మగ పిల్లలకు వేర్వేరు మరుగుదొడ్లు, నిరంతర నీటి సౌకర్యంతో ఉండేలా చూడాలని ఆదేశించింది. అలాగే.. పాఠశాలల్లో ఇప్పటికే ఉన్న, కొత్తగా కట్టబోయే మరుగుదొడ్లను.. విద్యార్థుల గోప్యతను కాపాడేలా, దివ్యాంగులతో సహా పిల్లలందరి అవసరాలకు అనుగుణంగా ఉండాలని స్పష్టం చేసింది.

పాఠశాలలో ఉన్నప్పుడు నెలసరి వస్తే బాలికలు ఇబ్బంది పడకుండా.. అత్యవసర చర్యల్లో భాగంగా అన్ని పాఠశాలలూ రుతుక్రమ ఆరోగ్య నిర్వహణ కార్నర్లు ఏర్పాటు చేయాలి. వాటిలో అదనపు లోదుస్తులు, అదనపు యూనిఫారాలు, వాడిన శానిటరీ న్యాప్‌కిన్లను పారేయడానికి వీలుగా డిస్పోజబుల్ బ్యాగులు, ఇతరత్రా అవసరమైన అన్ని వస్తువులనూ ఆయా కార్నర్లలో ఉంచాలి. ప్రతి పాఠశాల లోనూ వాడేసిన శానిటరీ న్యాప్‌కిన్లను పారవేయడానికి సురక్షితమైన, పరిశుభ్రమైన, పర్యావరణానికి హాని కలిగించని యంత్రాంగం ఉంచేలా చర్యలు తీసుకోవాలి.

'రుతుక్రమ ఆరోగ్యం, యవ్వనదశపై అవగాహన, శిక్షణ' అనే అంశంపై పాఠ్యాంశాల్లో మార్పులు చేయాలని.. నెలసరి సమయంలో, యవ్వనదశలో వచ్చే మార్పులు, ఆరోగ్య సమస్యలపై లింగ సున్నితత్వంతో కూడిన పాఠ్యాంశాలను చేర్చాలని నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రిసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎన్‌సీఈఆర్‌టీ), స్టేట్ కౌన్సిల్స్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రిసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎస్‌సీఈఆర్‌టీ)లకు ఆదేశాలు జారీ చేసింది. తీర్పు వెలువడిన తేదీ నుంచి 3 నెలల్లోగా ఈ ఆదేశాలన్నీ ఖచ్చితంగా అమలయ్యేలా చూడాలని ఆదేశించింది. ■

## 'మునగ' ప్యాడ్లతో బహిష్టు సురక్ష

**రు**తుస్రావం సమయంలో మహిళలు మూత్రనాళ సమస్యలు, బ్యాక్టీరియల్ వాగినోసిస్, ఫంగల్ ఇన్ఫెక్షన్లు వంటి బారిన పడే ప్రమాదం ఉంది. అయితే నెలసరి అప్పుడు మునగ మొక్క (మోరింగా) సారాల ఆధారిత శ్యానిటరీ ప్యాడ్‌లను వినియోగించడం వలన ఈ రిస్క్‌ను తగ్గించే అవకాశం ఉందని ప్రముఖ గైనకాలజిస్టులు, వైద్య




నిపుణులు పేర్కొంటున్నారు. ఇవి సహజమైనవని, చర్మ స్వభావానికి అనుకూలం (స్కిన్ ఫ్రెండ్లీ)గా ఉంటాయని తెలిపారు.

సంప్రదాయ వైద్యంలో మునగ చెట్టును ఒక 'అద్భుతమైన వృక్షం'గా చెబుతుంటారు. ఇది దానిలోని విస్తృత శ్రేణి బయో యాక్టివ్ సమ్మేళనాలకు ప్రసిద్ధి చెందింది.

దీనివలన పలు ఆరోగ్యపరమైన ఉపయోగాలు ఉన్నాయని ఆధునిక శాస్త్రీయ అధ్యయనాలు కూడా ధ్రువీకరిస్తున్నాయి. వాటిల్లో పరిశుభ్రత, నెలసరి సంరక్షణకు సంబంధించిన యాంటీ మైక్రోబియాల్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీఆక్సిడెంట్ ప్రభావాలు వంటివి ఉన్నాయి. సాధారణ ఔషధాలతో పోలిస్తే మునగ ఆకుల సారాలు యాంటీ ఇన్‌ఫ్లమేటరీ చర్యను ప్రదర్శించినట్లు ఓ అధ్యయనం వెల్లడించింది ■

మాటల్లో కాఠిన్యం, మనసులో మెత్తదనం మంచివారి నైజం ; అది నటనలు తెలియని సౌజన్య తత్వం

# పచ్చి పసుపుతో ఆరోగ్యకర ఆహారపదార్థాలు !

- డా. బి. నవ్య, గృహవిజ్ఞాన శాస్త్రవేత్త

పసుపు అనేది పసుపు కొమ్ము నుండి వచ్చే సుగంధ ద్రవ్యం. పసుపును సాధారణంగా భారతీయ ఆహార పదార్థాలతయారీలో రుచి లేదా రంగును పెంపొందించడానికి మసాలా దినుసుగా ఉపయోగిస్తారు. పసుపు వేరు నందు 'కర్కుమిన్' అనే బయోయాక్టివ్ రసాయనం ఉండడంవలన ఆయుర్వేద వైద్యంలో ఔషధాల తయారీకి శతాబ్దాలుగా వసుపు కొమ్ములను ఉపయోగిస్తున్నారు. పసుపు అనేక ఆరోగ్య ప్రయోజనాలతో కూడి ఉంటుంది. దీనిని తీసుకోవడం వల్ల జీవక్రియ ప్రేగు కదలికలు మెరుగు అవుతాయి. జీర్ణశక్తి పెరగడం వల్ల కడుపు ఉబ్బటం, గ్యాస్ట్రిక్ సమస్యలు తగ్గుతాయి.



పసుపులోని యాంటీ ఆక్సిడెంట్స్ మరియు యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు శరీరానికి చాలా మేలు చేస్తాయి. పసుపు రోగనిరోధక శక్తిని పెంచి ఆరోగ్యాన్ని కాపాడడమే కాకుండా చర్మ సమస్యల్ని కూడా దూరం చేస్తుంది. పసుపులోని ప్రత్యేక గుణాల వలన హార్ట్ ఫ్రెండ్లీ అని చెప్పవచ్చు. పసుపును ప్రతి రోజు తీసుకుంటే రక్తంలో కొలెస్ట్రాల్ తగ్గుతుంది.

గుండె ధమనుల్లో కొవ్వు పెరగదు. శరీరంలో రక్త ప్రసరణ సాఫీగా సాగుతుంది. పసుపులో క్యాన్సర్ నిరోధక గుణాలు ఉంటాయి. ఇది కణాల నష్టాన్ని పూర్తిగా తగ్గించి కణితులు ఏర్పడకుండా చేస్తుంది. పసుపుతో తయారు చేయగల అనేక విలువలతో కూడిన ఉత్పత్తులు మార్కెట్లో భారీ వాణిజ్య ఆమోదయోగ్యత మరియు ఆరోగ్య ప్రయోజనాలు కలిగి ఉంటాయి. పసుపు ఒలియోరెసిన్, పసుపు చుక్కలు, కర్కుమిన్ పౌడర్, పసుపు పాలు మొదలైనవి కొన్ని ఉదాహరణలు. పసుపు కొమ్ములతో కింద తెలిపిన ఆరోగ్యవంతమైన విలువ ఆధారిత ఉత్పత్తులు తయారు చేసుకోవచ్చు.

**1.పచ్చి పసుపు ఊరగాయ**

కావలసిన పదార్థాలు: పసుపు కొమ్ములు-1 కేజీ, ఆవ నూనె: 250 మి.లీ, ఉప్పు: తగినంత, కారం: 5 గ్రా., ఆవపొడి:30 గ్రా.,వెనిగర్: 50 మి.లీ., జీలకర్ర:15 గ్రా., సొంప:5 గ్రా.

**తయారీ విధానం:** తాజా పసుపు కొమ్ములను శుభ్రముగా కడిగి, తొక్క తీయాలి. వీటిని తురిమి తడి లేనంత వరకు ఆరబెట్టుకోవాలి. కడాయిలో నూనె వేడి చేసి జీలకర్ర, సొంపు, పసుపు తురుము వేసి అయిదు నిమిషాలు ఉడికించాలి. చల్లారాక ఇందులో కారం, ఆవపొడి, ఉప్పు వేసి బాగా కలపాలి. తరువాత వెనిగర్ వేసి బాగా కలిపి గాజు సీసాలో నింపి పొడి ప్రదేశంలో నిలువ చేసుకోవాలి. ఈ పసుపు ఊర గాయ ఎక్కువ కాలం నిల్వ ఉంటుంది మరియు ఎప్పటికీ తాజా పసుపు రుచిని ఇస్తుంది.

**2. వచ్చి పసుపు పచ్చడి**

**కావలసిన పదార్థాలు**

పసుపు కొమ్ములు:1 కేజీ, ఆవనూనె:250 మి.లీ., ఉప్పు- తగినంత, కారం:5 గ్రా, బెల్లంపొడి : 250, వెనిగర్: 50 మి లీ., జీలకర్ర :15 గ్రా., సొంపు : 5గ్రా

**తయారీ విధానం:** తాజా పసుపు కొమ్ములను శుభ్రముగా కడిగి, తొక్క తీయాలి. వీటిని చిన్న ముక్కలుగా కోసి కడాయిలో తీసుకొని మూత మూసి పది నిమిషాలు ఉడికించాలి. చల్లారాక మిక్సీలో మెత్తగా రుబ్బుకోవాలి. కడాయిలో నూనె వేడి చేసి జీలకర్ర, సొంపు, పసుపు పేస్ట్, ఉప్పు, కారం వేసి బాగా కలపాలి. తరువాత బెల్లం పొడి, వెనిగర్ వేసి చిక్కబడే వరకు ఉడికించాలి. చల్లారాక గాజు

తోడు లేకపోతే చిన్న ప్రయాణమైనా నరకమే, మనసుకు నచ్చిన తోడుంటే నరకంలోనైనా స్వర్గమే !

సీసాలో నింపి పొడి ప్రదేశంలో నిలువ చేసుకోవాలి. ఈ పసుపు పచ్చడి శీతాకాలంలో జలుబు మరియు ఫ్లూ నుండి కూడా రక్షణ కల్పిస్తుంది.

**3. పచ్చి పసుపు పంజిరి**

పసుపు పంజిరి ఒక సాంప్రదాయ భారతీయ ప్రసవానంతర వంటకం. ఇది పాలు ఇచ్చే తల్లులకు అనేక ప్రయోజనాలను అందిస్తుందని నమ్ముతారు. వాటిలో ముఖ్యమైనవి తల్లి పాల ప్రవాహాన్ని ప్రేరేపించడం, శక్తిని పెంచడం మరియు ప్రసవం తర్వాత తల్లి కోలుకోవడంలో సహాయపడటం.

**కావలసిన పదార్థాలు**

పసుపు కొమ్ములు:200 గ్రా.,నెయ్యి : 250 గ్రా., గోధుమ పిండి:100 గ్రా.,బాదం:50గ్రా.,ఎండు ద్రాక్ష:20 గ్రా., జీడి పప్పు:50 గ్రా.,అల్లం పొడి:50 గ్రా. బెల్లం పొడి :100 గ్రా.

**తయారీ విధానం :** తాజా పసుపు కొమ్ములను శుభ్రంగా కడిగి, తొక్క తీసి ముక్కలుగా కోసుకోవాలి. కడాయిలో నెయ్యి వేడి చేసి, పసుపు కొమ్ము ముక్కలను కరకరలాడే వరకు వేయించి పక్కనపెట్టుకోవాలి. చల్లారాక వీటిని మిక్సీలో మెత్తగా పొడి చేసుకొని పక్కన పెట్టుకోవాలి. అదే కడాయిలో మిగిలిన నెయ్యిలో, ఎండుద్రాక్ష, తరిగిన బాదం మరియు జీడి పప్పును వేయించి పక్కనపెట్టుకోవాలి. తరువాత అదే కడాయిలో మిగిలిన నెయ్యిలో గోధుమ పిండిని 1-2 నిమిషాలు వేయించాలి. ఇందులో బెల్లంపొడి, అల్లం పొడి, పసుపు, ఎండు ద్రాక్ష, బాదం మరియు జీడిపప్పు వేసి చల్లబడే వరకు బాగా కలిపి సర్వ్ చేసుకోవాలి.

**4. పచ్చి పసుపు లడ్డు**

**కావలసిన పదార్థాలు**

పసుపు కొమ్ములు: 500 గ్రా., నెయ్యి : 30 గ్రా.,బాదం: 150 గ్రా., వాల్నట్ :100 గ్రా., ఎండు ద్రాక్ష : 20 గ్రా., జీడిపప్పు :100 గ్రా.,వాల్నట్ :50 గ్రా.కొబ్బరి తురుం :100 గ్రా., బెల్లం:500 గ్రా., నల్ల మిరియాల పొడి :10 గ్రా.

**తయారీ విధానం :** తాజా పసుపు కొమ్ములను శుభ్రముగా కడిగితొక్క తీసి తురుముకోవాలి. కొద్దిగా నెయ్యి వేడి చేసి డ్రై ఫ్రూట్స్ వేయించి చల్లారాక పొడి చేసి పక్కన ఎట్టుకోవాలి. అలాగే మఖానాను చిన్న మంట మీద కర కరలాడే వరకు వేయించి, చల్లారాక పొడి చేసి పెట్టుకోవాలి. కడాయిలో కొద్దిగా నెయ్యి తురిమిన పసుపును చిన్న మంట మీద పచ్చి వాసన పోయి నెయ్యి వేరుపడే వరకు వేయించి పక్కన పెట్టుకోవాలి. బెల్లంను నీటిలో కరిగించి తీగ పాకం తయారు చేసుకోవాలి. పసుపు తురుములో బెల్లం పాకం, తురిమిన కొబ్బరి, డ్రై ఫ్రూట్స్ పొడి, మాఖానా పొడి మరియు నల్ల మిరియాల పొడి వేసి బాగా కలుపుకోవాలి. ఈ మిశ్రమంలో నెయ్యి వేసుకుంటూ లడ్డులు చుట్టుకోవాలి.

**5. పచ్చి పసుపు హల్వా**

**కావలసిన పదార్థాలు:**

పసుపు కొమ్ములు: 500 గ్రా., నెయ్యి తురుం:75 గ్రా., పాలు:200 మి.లీ., బాదం:100 గ్రా.,ఎండు ద్రాక్ష:20 గ్రా., జీడిపప్పు:100గ్రా.,వాల్నట్:50 గ్రా., గోధుమ పిండి : 100 గ్రా., బెల్లంపొడి:100 గ్రా.,నల్ల మిరియాల పొడి: 10 గ్రా.

**తయారీ విధానం :** తాజా పసుపు కొమ్ములను శుభ్రంగా కడిగి, తొక్క తీసి, తురుముకోవాలి. కొద్దిగా నెయ్యి వేడి చేసి డ్రై ఫ్రూట్స్ వేయించి పక్కన పెట్టుకోవాలి. అలాగే కొద్దిగా నెయ్యిలో గోధుమపిండిని బంగారు రంగు వచ్చే వరకూ వేయించి పక్కన పెట్టుకోవాలి. మిగిలిన నెయ్యిని వేడి చేసి తురిమిన పసుపును వేసిచిన్న మంట మీద పచ్చి వాసన పోయే వరకు వేయించాలి. నెయ్యి విడిపోతుండగా ఇందులో గోధుమపిండి వేసి బాగా కలపాలి. తరువాత పాలు, బెల్లం పొడి వేసి బాగా కలపాలి. మిశ్రమం దగ్గరపడ్డాకా డ్రై ఫ్రూట్స్ వేసి బాగా కలిపి హల్వాను సర్వ్ చేసుకోవాలి.

**6. పచ్చి పసుపు కోవా బర్ఫీ**

**కావలసిన పదార్థాలు**

చిక్కటి పాలు:2 లీ., పసుపు కొమ్ములు:100 గ్రా, బెల్లం పొడి:400 గ్రా, బాదం పొడి: 200 గ్రా , కొబ్బరి పొడి: 200 గ్రా, యాలకుల పొడి:5 గ్రా, నెయ్యి:15 గ్రా, పుచ్చకాయ గింజలు : 10 గ్రా

**తయారీ విధానం:** తాజా పసుపు కొమ్ములను

# తెలంగాణ మాతృత్వ ప్రయోజన పథకం



**తె**లంగాణ రాష్ట్రంలో అమలులో ఉన్న మాతృత్వ ప్రయోజన పథకం ప్రధానంగా భవన నిర్మాణం మరియు ఇతర నిర్మాణ కార్మికుల (బి ఒ సి డబ్ల్యు) సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని రూపొందించబడింది. గర్భధారణ సమయంలో మరియు ప్రసవానంతరం మహిళలు ఎదుర్కొనే ఆర్థిక భారం తగ్గించడమే ఈ పథకం ప్రధాన లక్ష్యం. ముఖ్యంగా నమోదు అయిన నిర్మాణ కార్మికులు, వారి భార్యలు లేదా కుమార్తెలకు ఈ పథకం ద్వారా నేరుగా ఆర్థిక సహాయం అందుతుంది.

ఈ పథకం ప్రకారం, అర్హులైన లబ్ధిదారులకు ఒక్కో ప్రసవానికి మొత్తం రూ. 30,000 ఆర్థిక సహాయం అందజేస్తారు. ఈ మొత్తం గరిష్టంగా రెండు ప్రసవాలకు మాత్రమే వర్తిస్తుంది. చెల్లింపు విధానం కూడా స్పష్టంగా రూపొందించబడింది. గర్భధారణ ఏడవ నెలలో రూ. 10,000 అందజేస్తారు. శిశువు జన్మించిన తరువాత మిగిలిన రూ. 20,000 లబ్ధిదారుని ఖాతాలో జమ చేయబడుతుంది. ఈ విధంగా దశల వారీగా సహాయం అందించడం వల్ల గర్భిణీ మహిళలకు అవసరమైన వైద్య, పోషకాహార ఖర్చులకు మద్దతు లభిస్తుంది.

ఈ పథకానికి అర్హత పొందాలంటే, సంబంధిత నిర్మాణ కార్మికుడు తెలంగాణ భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డులో కనీసం 12 నెలల పాటు నమోదు అయి ఉండాలి. అలాగే, ప్రసవం జరిగిన తేదీ నుంచి ఒక సంవత్సరంలోపు దరఖాస్తు సమర్పించాలి. దరఖాస్తును సంబంధిత లేబర్ డిపార్ట్‌మెంట్ అధికారికి సమర్పించాల్సి ఉంటుంది. అవసరమైన ధ్రువపత్రాలు సమర్పించిన తరువాత అర్హత నిర్ధారణ జరుగుతుంది.

ఇదే కాకుండా, రాష్ట్రంలో అమలులో ఉన్న మరో ముఖ్యమైన పథకం ఆరోగ్య లక్ష్మి. ఈ పథకం ద్వారా గర్భిణీ మరియు పాలిచ్చే మహిళలకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా పోషకాహారం అందజేస్తారు. రోజూ ఒక పౌష్టిక భోజనం, రోజుకు ఒక గుడ్డు, నెలకు 25 రోజులు 200 మిల్లీలీటర్ల పాలు అందించడం ద్వారా తల్లి, బిడ్డ ఆరోగ్యాన్ని

---

శుభ్రముగా కడిగి, తొక్కతీసి, తురుముకోవాలి. కడాయిలో కొద్దిగా నెయ్యి, తురిమిన పసుపును చిన్న మంట మీద పచ్చి వాసన పోయి నెయ్యి వేరుపడేవరకు వేయించి పక్కన పెట్టుకోవాలి. అలాగే కడాయిలో చిన్నమంట మీద పాలను బాగా చిక్కబడే వరకు మధ్య మధ్యలో కలుపుకుంటూ మరగనివ్వాలి. ఇందులో పసుపు తురుము, బెల్లంపొడి, కొబ్బరి పొడి వేసి దగ్గర పడి నీటి బుడగలు రానంతవరకు చిన్న మంట మీద ఉడికించుకోవాలి. మిశ్రమంలో ఏలుకుల పొడివేసి బాగా కలిపి నెయ్యి రాసిన పళ్ళెంలో రెండు అంగుళాల మందంతో సమానంగా విస్తరించాలి. మిశ్రమం పైన వేయించిన పుచ్చకాయ గింజలను వేసి అలంకరించుకొని రెండు గంటలు ఆరనివ్వాలి. గట్టి పడ్డకా బర్ఫీని ముక్కలు చేసుకోవాలి.

**7. పసుపు పొడి**

కావలసిన పదార్థాలు: తాజా పసుపు కొమ్ములు

**తయారీ విధానం:** తాజా పసుపు కొమ్ములు తీసుకొని, గ్రేడింగ్ చేసి, ముక్కలుగా కోసి, $70^0$ సెం.గ్రే వద్ద 8-12 గంటలు ఎండబెట్టి, మెత్తని పొడి చేసి, జల్లడ పట్టుకోవాలి. ఈ పద్ధతిలో పసుపు పొడిని తక్కువ సమయములో తయారు చేసుకోవడమే కాకుండా 'కర్కుమిన్' శాతం అధికంగా ఉంటుంది. ■

మెరుగుపరచడం దీని ఉద్దేశ్యం.

జాతీయ స్థాయిలో అమలులో ఉన్న ప్రధాన్‌మంత్రి మాతృ వందన యోజన (పిఎంఎంవివై) కూడా తెలంగాణలో అందుబాటులో ఉంది. ఇది మొదటి సజీవ ప్రసవానికి మాత్రమే వర్తించే నగదు ప్రోత్సాహక పథకం. గర్భధారణ నమోదు, వైద్య పరీక్షలు, శిశు సంరక్షణ వంటి దశలలో నగదు సహాయం అందుతుంది. ఈ పథకం ఐసీడీఎస్ మరియు అంగన్వాడీ కేంద్రాల ద్వారా అమలు చేయబడుతుంది.

ఈ అన్ని పథకాలు కలిసి మహిళలకు మాతృత్వ సమయంలో ఆర్థిక భరోసా కల్పిస్తాయి. ముఖ్యంగా నిర్మాణ రంగంలో పని చేసే కుటుంబాలకు ఇది ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. (మెటర్నిటీ బెనిఫిట్ స్కీమ్) వంటి సంక్షేమ చర్యలు మహిళల ఆరోగ్యం, కుటుంబ భద్రతను బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి.

**ముఖ్య సమాచారం పట్టిక**

| అంశం | వివరాలు |
|---|---|
| పథకం పేరు | మాతృత్వ ప్రయోజన పథకం (బిఓసిడబ్ల్యు) |
| మొత్తం సహాయం | రూ.30,000 |
| ప్రసవాల పరిమితి | గరిష్టంగా 2 |
| అర్హత | 12 నెలల నమోదు ఉన్న నిర్మాణ కార్మికులు |
| సంబంధిత శాఖ | లేబర్ డిపార్ట్‌మెంట్ |

**వైద్య ఖర్చులకు ఆర్థిక భరోసా**

హాస్పిటలైజేషన్ రిలీఫ్ స్కీమ్ అనేది ఆసుపత్రిలో చికిత్స పొందాల్సిన పరిస్థితుల్లో ఆర్థిక భారం తగ్గించేందుకు రూపొందించిన సంక్షేమ పథకం. ఈ పథకం ముఖ్యంగా నిర్మాణ కార్మికులు, జర్నలిస్టులు, వికలాంగులు, మరియు ప్రత్యేక వృత్తి వర్గాలకు రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అమలు చేయబడుతుంది. ప్రమాదాలు, తీవ్రమైన వ్యాధులు, దీర్ఘకాలిక ఆసుపత్రి చికిత్స లేదా ప్రసవ సంబంధిత అవసరాల సమయంలో ఈ పథకం ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

ఈ స్కీమ్ ప్రధాన ఉద్దేశ్యం ఏమిటంటే, అనుకోని వైద్య ఖర్చుల వల్ల కుటుంబ ఆర్థిక స్థితి దెబ్బతినకుండా రక్షణ కల్పించడం. చాలా సందర్భాల్లో కనీసం 5 రోజులకుపైగా ఆసుపత్రిలో చేరిన వారికి మాత్రమే ఈ సహాయం అందుతుంది. కొన్ని రాష్ట్రాల్లో క్యాన్సర్ వంటి తీవ్రమైన వ్యాధులకు ప్రత్యేకంగా ఆర్థిక సహాయం కూడా అందిస్తున్నారు.

నిర్మాణ కార్మికుల కోసం అమలులో ఉన్న పథకాలలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు ముఖ్యమైనవి. ఈ రాష్ట్రాల్లో నమోదైన నిర్మాణ కార్మికులు ప్రమాదం లేదా వ్యాధి కారణంగా ఆసుపత్రిలో చేరితే వారికి నగదు సహాయం అందుతుంది.

ఉత్తరప్రదేశ్‌లో "గంభీర్ బిమారి సహాయత యోజన" ద్వారా ఆయుష్మాన్ భారత్ కవరేజ్ లేని నిర్మాణ కార్మికులకు ఎంపిక చేసిన ఆసుపత్రుల్లో చికిత్సకు ఆర్థిక మద్దతు లభిస్తుంది.

జర్నలిస్టుల విషయంలో, పని చేస్తున్నవారికీ, పదవీ విరమణ చేసినవారికీ వైద్య అవసరాల కోసం ప్రత్యేక సహాయ పథకాలు ఉన్నాయి. ఇవి సాధారణ చికిత్సలతో పాటు తీవ్రమైన అనారోగ్యాల ఖర్చులను కూడా కొంతవరకు భరిస్తాయి. అలాగే ప్రసూతి సహాయం కోసం తెలంగాణ వంటి రాష్ట్రాల్లో మాతృత్వ ప్రయోజన పథకాలు అమలులో ఉన్నాయి. ఇవి ప్రసవ సమయంలో అవసరమైన వైద్య ఖర్చులకు తోడ్పడతాయి.

ఈ పథకాల కోసం అర్హత సాధారణంగా సంబంధిత సంక్షేమ బోర్డులో నమోదు అయి ఉండడం మీద ఆధారపడి ఉంటుంది. క్రమం తప్పకుండా బోర్డు నిధికి చందా చెల్లించడం కూడా కీలక అర్హత. ఆసుపత్రిలో చేరినట్టు రుజువులు, ఆదాయ పరిమితి, వృత్తి స్థితి వంటి అంశాలు కూడా పథకం ప్రకారం మారుతాయి.

హెల్త్ ఇన్సూరెన్స్ స్కీమ్ వంటి సంక్షేమ చర్యలు సామాజిక భద్రతను బలోపేతం చేస్తాయి. ముఖ్యంగా రోజువారీ కూలీలు, అసంఘటిత రంగంలో పని చేసే వారికి ఇవి ఒక రక్షణ కవచంలా పనిచేస్తాయి. వైద్య ఖర్చుల భయం లేకుండా చికిత్స పొందే అవకాశం కల్పించడం ఈ పథకాల ప్రధాన లాభం. ■

ఇతరులు చూడలేనిదానిని చూడగలగడమే దార్శనికత్వం, సాధించడమే సామర్థ్యం

# తేనెటీగల పెంపకంతో ఏడాదికి రూ. 40 లక్షల సంపాదన !

గుజరాత్ రాజ్‌కోట్‌లోని గోండల్ గ్రామానికిచెందిన బ్రిజేష్ బి కలారియా కంప్యూటర్ అప్లికేషన్స్‌లో డిగ్రీ పూర్తి చేశాడు. ఆ తర్వాత పుణెలో యానిమేషన్, సినిమా ఎడిటింగ్‌కు సంబంధించిన కోర్సు చేశాడు. అనంతరం ముంబైలోని గ్లోబల్ మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్ సర్వీసెస్ కంపెనీలో ఉద్యోగం వచ్చింది. ఓ ఏడాది పాటు ఉద్యోగం చేశారు. నాలుగు గోడల మధ్య కూర్చొని సినిమాలు ఎడిట్ చేస్తూనే ఉన్నాడు. కానీ ఇది అతని జీవితం కాదనుకున్నాడు బ్రిజేష్. నాన్న సాగు చేసే పత్తి, వేరుశనగపొలంలో సమయం గడపడం ఎక్కువ ఆనందాన్ని ఇస్తుందని బ్రిజేష్ గ్రహించాడు. దీంతో ఉద్యోగం మానేసి ఇంటి బాట పట్టాడు.



ఇక గోండల్ గ్రామానికి తిరిగొచ్చిన బ్రిజేష్.. వ్యవసాయంపై దృష్టి సారించాడు. తండ్రి వ్యవసాయంలో ఎంతో కష్టపడుతున్నప్పటికీ.. లాభాలు పెద్దగా లేవు. ఈ క్రమంలో తమకున్న భూమిలో ఎక్కువ దిగుబడి, లాభాలు వచ్చే పంటలపై బ్రిజేష్ దృష్టి పెట్టాడు. ఈ ఆలోచనల నుంచి పుట్టిందే ఎపికల్చర్. అదే తేనెటీగల పెంపకం.

**తేనెటీగల పెంపకం ఎందుకు..?**

ఇక బ్రిజేష్ తేనెటీగల పెంపకం ఎందుకు ఎంచుకున్నాడంటే.. ఎపికల్చర్‌కు ఎక్కువగా భూమి అవసరం లేదు. వీటికి ఉపయోగించే పెట్టెలను ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి సులభంగా తరలించొచ్చు. అదనపు ఆదాయం సంపాదించడానికి కూడా ఇది ఒక మంచి మార్గమని భావించాడు బ్రిజేష్.

ఈ క్రమంలో 2016లో తేనెటీగల పెంపకాన్ని ప్రారంభించాడు. సమీప గ్రామంలోని తేనెటీగల పెంపకం దారుడి నుంచి 10 తేనెటీగల పెట్టెలను కొనుగోలు చేశాడు. ఒక్కో పెట్టె ఖరీదు రూ. 4 వేలు. ఎలాంటి శిక్షణ లేకుండానే ఎపికల్చర్ చేయడం మొదలుపెట్టాడు.

ఇక తేనెటీగల పెట్టె నుంచి రెండు నెలల కంటే తక్కువ సమయంలోనే తేనెను సేకరించేందుకు బ్రిజేష్ సిద్ధమయ్యాడు. 40 రోజుల్లో 18 కిలోల తేనెను సేకరించాడు. స్థానిక మార్కెట్‌లో కిలో తేనెను రూ. 500 చొప్పున విక్రయించాడు యువ రైతు. అలా రూ. 9 వేల వరకు ఆదాయం వచ్చింది.

**10 పెట్టెల నుంచి 50 పెట్టెలకు విస్తరణ**

తన ఎపికల్చర్‌ను 10 పెట్టెల నుంచి 50 పెట్టెలకు విస్తరించాడు బ్రిజేష్. రాణి తేనెటీగ నిరంతరం గుడ్లు పెట్టడం వల్ల ఒక సమూహంలోని తేనెటీగల సంఖ్య పెరుగుతుంది. నేను ఆరు నెలల్లో 10 పెట్టెలను 50 పెట్టెల తేనెటీగలుగా పెంచాను. వాటి నుండి కూడా తేనెను సేకరించినట్లు బ్రిజేష్ పేర్కొన్నాడు.

ఎపికల్చర్‌కు ప్రభుత్వం నుంచి 50 శాతం సబ్సిడీ లభించింది. వాము పొలాల్లో తేనెటీగల పెట్టెలను ఉంచడం మొదలుపెట్టాడు. తేనెటీగలు వాము పువ్వుల మకరందాన్ని సేకరించడంతో ఆ తేనె మరింత ఔషధ గుణాలను కలిగి ఉంటుంది.

**ఏడాదికి రూ. 40 లక్షల టర్నోవర్**

2016లో రాజ్‌కోట్‌లో జరిగిన ఓ ఎగ్జిబిషన్‌లో బ్రిజేష్ పాల్గొన్నాడు. ఆ ఎగ్జిబిషన్‌లో తేనెను విక్రయించాడు. బ్రిజేష్ తేనెకు భారీగా డిమాండ్ వచ్చింది. దాంతో ప్రతి ఏడాది ఎగ్జిబిషన్‌లో పాల్గొని తేనెను విక్రయించడం ప్రారంభించాడు. ఏడాదికి 5 వేల కిలోల తేనెను విక్రయిస్తున్నాడు. కిలో తేనెను రూ. 800కు అమ్ముతున్నాడు. మొత్తంగా ఏడాదికి రూ. 40 లక్షల టర్నోవర్‌కు ఎదిగాడు బ్రిజేష్. ■

**బలం అంటే ఇష్టంలేనివాటిని నాశనం చేయడం కాదు, ఇష్టమైనవాటిని కష్టమైనా సృష్టించుకోవడం**

# వాతావరణ మార్పుల ప్రభావం

## వ్యవసాయంపై ...


వాతావరణ మార్పులు - వ్యవసాయం కరువు కాటకాల పాలు
పెరిగే ఎండలతో కరువు కాటకాలు - అధికమైన చీడపీడలు
భూమి గట్టిపడటం - భూసారం తగ్గిపోవడం
అడుగంటిన భూగర్భ జలాలు - ఆవిరవుతున్న నీటి వనరులు

భూమిలో తేమ లేదు - వేసిన విత్తు మొలవదు
అకాల వర్షాలు - నీరంతా సముద్రం పాలు
భూమిలోకి నీరు ఇంకదు - పంటకు నీరు అందదు

చేతికి రాని పంటలు - తగ్గిపోతున్న పంట దిగుబడులు
మేత, నీరు అందని జీవాలు - తగ్గిపోతున్న పశు సంపద
ఉపాధిలేని కుటుంబాలు - పెరుగుతున్న వలసలు
అప్పుల భారంతో వ్యవసాయం నష్టాల పాలు-
కృంగిపోతున్న రైతన్న జీవితాలు
అయినా... వానకోసం రైతన్న పడిగాపులు



## జీవనోపాధులపై....



పెరిగే వలసలు

రోగాలతో
పెరుగుతున్న ఖర్చులు

ఆహార
భద్రతకు ముప్పు

పోషకాహార
లోపాలు

తగ్గే ఉపాధి
అవకాశాలు

పంట నష్టాలతో
పెరిగే అప్పులు

NABARD

RNI Regd.No: TELTEL/2003/16365 MAHILA SADHIKARATHA Postal Regd No: HCD-1064/2024-26
*Publication Date:01-02-2026* Posting at BPC-1V Patrika Channel, Nampally, Hyderabad-500001 *Posting Date: 05/06-02-2026*

# ముఖ్యమంత్రి సభలో మరికొన్ని విశేష దృశ్యాలు !





## కొలువు దీరిన తెలుగు పద్మాలు !


వెంపటి కుటుంబశాస్త్రి


బాలసుబ్రహ్మణియన్


దీపికారెడ్డి


గద్దమణుగు చంద్రమౌళి


గరిమెళ్ళ బాలకృష్ణప్రసాద్


విజయానందరెడ్డి


జగదీశ్ కుమార్


రాజేంద్రప్రసాద్


మురళీ మోహన్


కుమారస్వామి తంగరాజ్


జి వి రావు


శ్రీ నరసన్న, శ్రీ దిల్‌రాజ్ కుటుంబాలకు మేధోమథన సన్నివేశం


బంగారు మిత్రలకు ఏపిమాస్ శిక్షణ సందర్భం

To ADDRESS


ముఖ్యమంత్రి సభలో సహాయం అందజేత

బట్వాడా కాకపోతే దయచేసి ఈ చిరునామాకు తిప్పిపంపండి

ఎడిటర్, మహిళా సాధికారత, ఏపిమాస్ కార్యాలయం, ప్లాట్ నెం.11-12, హుడా కాలని, తానీషానగర్, డ్రీమ్‌వ్యాలీ దగ్గర, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు-500089